ఓడిన నేత... ఏంటీ రాత!!



ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖపట్నం ఎంపీగా తెదేపా నేత శ్రీభరత్ భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. నాటి వైకాపా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాజీ అయ్యారు. అయితే... లాసన్స్‌బే కాలనీలో ఉన్న ఎంవీవీ ఇంటి ప్రహరీ వైపు చూస్తే మాత్రం అవాక్కవుతారు. ఎందుకంటే... ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ అనే బోర్డులు తళతళ మెరుస్తూ కనిపిస్తాయి. అధికారం పోయినా..ఎన్నికల్లో ఓడిపోయినా హోదాపై ఆయనకు ఆసక్తి పోలేదేమో అనే విమర్శలొస్తున్నాయి.

– ఈనాడు, విశాఖపట్నం

హోటళ్లు, ఆతిథ్యరంగానికి పునర్‌వైభవం: ఎంపీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న నేపథ్యంలో హోటళ్లు, ఆతిథ్యరంగానికి మరింత ప్రాధాన్యం ఇచ్చే ఉద్దేశంతో రాత్రి 12 గంటల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు నడిపే అవకాశం కల్పించినట్లు విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ఓ ప్రకటనలో శనివారం పేర్కొన్నారు. ఈ నిర్ణయం రానున్న రోజుల్లో ఐ.టి., పర్యాటక రంగాల అభివృద్ధికి మేలు చేస్తుందన్నారు.

నేడు డైవర్స్/విడో/విడోవర్ (అన్ని కులాలు)లకు..

‘ఈనాడు పెళ్లిపందిరి’ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ‘ఈనాడు పెళ్లిపందిరి’ డైవర్స్/విడో/విడోవర్‌లకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో ‘ఈనాడు’ కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (ఆదివారం, అక్టోబరు 20న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **91549 18858, 80080 01686** ఫోన్ నెంబర్ల ద్వారాగానీ, యాప్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపించవచ్చు. **– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ**

కేకే‌లైన్‌లో విరిగిపడిన కొండచరియలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తవలస- కిరండూల్ రైలు మార్గంలో చిమిడిపల్లి సమీపంలో శనివారం 59వ నంబర్ వద్ద వర్షాలకు కొండచరియలు విరిగి పట్టాలపై పడ్డాయి. దీంతో కిరండూల్ పాసింజర్ రైలును చిమిడిపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మార్గం పునరుద్ధరణకు రైల్వే అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.

‘ప్రజా దర్బార్’కు వినతుల వెల్లువ

తెదేపా కార్యాలయంలో స్వీకరించిన మంత్రి లోకేశ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం విశాఖ తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన పలువురు మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని 1998 టీచర్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు. నాయీబ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని విశాఖకు చెందిన రమేష్, మీసేవ, సీఎస్‌సీ సెంటర్ల లాగిన్ ఐడీని పునరుద్ధరించాలని విశాఖ గొల్లలపాలేనికి చెందిన కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిని విక్రయించి తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విశాఖకు చెందిన ఆర్.లక్ష్మి, దివ్యాంగురాలైన తన కుమార్తెకు గత ప్రభుత్వం పింఛను నిలిపివేసిందని తిరిగి పునరుద్ధరించాలని అప్పలరాజు కోరారు.





తెదేపా కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

లోకేశ్.. మాపాలిట దేవుడు



లోకేశ్‌ను కలిసిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత

తమ కుమారుడు వావిలపల్లి చైతన్యనాయుడిని ఇంటికి తిరిగి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్న మంత్రి నారా లోకేష్ తమ పాలిలిట దేవుడిలా నిలిచారని విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం సంతకవిటి మండలానికి చెందిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత దంపతులు తెలిపారు. ఈ మేరకు లోకేశ్‌ను కలిసి ఆయన చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కూలిపనులు చేసుకుంటూ జీవించే వేణుగోపాలరావుకు ముగ్గురు అబ్బాయిలు. మూడో సంతానమైన చైతన్యనాయుడు బంధువుల ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అనుకోని పరిస్థితుల్లో బంధువుల ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎన్నిప్రయత్నాలు చేసినా ఆచూకీ తెలియలేదు. చివరికి విజయవాడలో జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా గాలించి హైదరాబాద్‌లో ఉన్న చైతన్యనాయుడిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. కుమారుడి రాకతో తమ కుటుంబం సంతోషంగా ఉందని, మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉన్నామని తెలిపారు.


14లో

‘ఇప్పటికీ అతనిదే వాణి’జ్యం!!

ఈనాడు, విశాఖపట్నం

గత వైకాపా ప్రభుత్వంలో విశాఖ వాణిజ్య పన్నులశాఖ అస్తవ్యస్తంగా తయారైంది. తనిఖీలు, పన్నులు వసూలులో తీవ్ర అలసత్వం కనిపించింది. ముఖ్యంగా నిబంధనలు పట్టించుకోని వైకాపా నేతలకు చెందిన సంస్థల వైపే చూడలేదు. వారి ప్రాజెక్టులకు సంబంధించి జీఎస్టీ అనుమతి తీసుకోకున్నా పట్టించుకోలేదు.

నాటి ప్రభుత్వంలో కొందరు దర్జాగా పన్నులు ఎగ్గొట్టినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. ఇదంతా ఓ అధికారి కనుసన్నల్లోనే సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చినా విశాఖ డివిజన్లో ఇప్పటికీ అతనే చక్రం తిప్పుతున్నారు. పలు శాఖల్లో ఆరోపణలు ఎదుర్కొన్న వారిని బదిలీ చేసినా..ఇక్కడ మాత్రం కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది.



అవి ఎన్నో ఉన్నాయి..

గత ప్రభుత్వం విశాఖ డివిజన్‌ను రెండు సర్కిళ్లుగా విభజించింది. ఇద్దరు సంయుక్త కమిషనర్లను నియమించింది. అలాగే ఓ ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేసింది. అయినప్పటికీ గత అయిదేళ్లలో ఎక్కడా అక్రమాలు గుర్తించిన దాఖలాలు లేవు.

➤ మూడేళ్ల కిందట జీఎస్టీ చెల్లించకుండా రవాణా చేస్తున్న ఓ కీలక వైకాపా నేతకు చెందిన వాణిజ్య వాహనాన్ని తనిఖీల్లో గుర్తించి అపరాధ రుసుం విధించారు. ఆ తర్వాత పైనుంచి ఒత్తిళ్లు రావడంతో వదిలేసినట్లు తెలిసింది.

➤ విశాఖలోని భారీ స్థాయిలో స్థిరాస్తి వ్యాపారం సాగిస్తున్న నేతపై పన్ను ఎగవేత ఆరోపణలు ఉన్నాయి. అయినా ఎటువంటి తనిఖీలు చేపట్టలేదు.

➤ విశాఖలోని వైకాపాకు చెందిన ఓ నేత వివాదాస్పద స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారు. అది వందల కోట్ల ప్రాజెక్టు. దానికి లైసెన్స్ తీసుకోవాల్సి ఉన్నా లేకుండానే కొనసాగించేశారు. ఇలాంటి ఎన్నో అక్రమాలను చూసీచూడనట్లు వదిలేశారు.

వైకాపాలో చక్రం తిప్పిన అధికారి

అవినీతి ఆరోపణలున్నా... ఇంకా నగరంలోనే తిష్ఠ

● విశాఖ డివిజన్‌లో ఓ కీలక అధికారిపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన్ను మార్చలేదు. గతంలో ఆ అధికారిపై అక్రమ ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. వైకాపా ప్రభుత్వంలో ఆ కేసు రద్దు చేయించుకునే క్రమంలో మొదట ఏసీబీ అభ్యంతరం తెలిపింది. ఓ నేత ఒత్తిడి మేరకు నాటి ముఖ్య అధికారులు జోక్యం చేసుకోవడంతో కేసు మూసేశారు. వైకాపా ముఖ్య నేత సిఫార్సులతో తరువాత కీలక పోస్టులో చేరారు. వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఎక్కడైనా తనిఖీలు చేపట్టాలంటే ముందుగా కమిటీ అనుమతుండాలి. ఆ కమిటీలో ఆ అధికారి సభ్యుడిగా ఉన్నారు. అందుకే వైకాపా సన్నిహితుల లావాదేవీల వైపే చూడలేదని సమాచారం.

రేపు తాగు నీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ జోన్-3 పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మంచినీటి సరఫరా విభాగ కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. టీఎస్సార్ నుంచి నీటిని సరఫరా చేసే పైపులైనుకు మరమ్మతులు చేపడుతుండటంతో ఈ చర్యలు తీసుకుంటున్నామని, మంగళవారం యథావిధిగా సరఫరా ఉంటుందన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా కార్యాలయం పరిసరాలు, సిద్ధార్థనగర్, పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పరిసరాలు, అశోక్‌నగర్, రామాటాకీస్ రహదారి, శ్రీనగర్, బుధిల్‌పార్కు, ద్వారకానగర్ అన్ని లైన్లలోనూ నీటి సరఫరా ఉండదని, ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు.

ఇది దారంటే నమ్మాలి.. దుమ్ము రేగినా వెళ్లాలి..!!





అసలే గోతులు.. ఆపై ధూళి కమ్మేయడంతో పరవాడ మండలంలోని లంకెలపాలెం కూడలి నుంచి సబ్బవరం వరకు ఉన్న 18 కిలోమీటర్ల రహదారిలో వాహనదారుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. పవర్‌ప్లాంట్లకు బొగ్గు తరలిస్తూ, అక్కడి నుంచి తడి ఫ్లైయాష్‌ను భారీ వాహనాల్లో రవాణా చేస్తుంటారు. అధిక లోడుతో ఈ లారీలు రాకపోకలు సాగించడంతో పాటు గోతుల కారణంగా బొగ్గు, తడి ఫ్లైయాష్ కిందపడి ఎండిన తర్వాత వాహనాల వెళ్లే సమయంలో దుమ్ము ఎగసి.. ధూళి కమ్మేస్తోంది. ద్విచక్రవాహన చోదకులు, ఆటోల్లో ప్రయాణించే వారి బాధలు వర్ణనాతీతం. – ఈనాడు, విశాఖపట్నం

రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినం సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లేవారు బాణసంచా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంటారని, అటువంటి వారిని రైళ్లలోకి అనుమతించబోమని వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. మండే గుణం గల బాణసంచాను రైళ్లలో తీసుకెళ్లడం శిక్షార్హమైన నేరమన్నారు. దీనికి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా లేదా రెండు శిక్షలు కలిపి అమలు చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రయాణికులెవరైనా రైళ్లు, రైల్వేస్టేషన్లలో దీపావళి సామగ్రిని చూస్తే రైల్వే సిబ్బందికి లేదా 139 టోల్‌ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని కోరారు.

తితిదే లడ్డూ విక్రయాల ప్రారంభం

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ కొండపై ఉన్న మహాలక్ష్మీ గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయం (తితిదే)లో శనివారం లడ్డూ విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఇటీవల తిరుమలలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇక్కడ లడ్డూ విక్రయాలు నిలిపి వేశారు. ఇక నుంచి రోజూ ఇక్కడ లడ్డూ విక్రయాలు కొనసాగుతాయని ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు.



లడ్డూలు విక్రయిస్తున్న నిర్వాహకులు

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ 2గంటలు ఆలస్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: నిర్వహణ పరమైన కారణాలతో షాలిమార్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 19న మధ్యాహ్నం 3.20గంటలకు బదులు 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.20గంటలకు బయలుదేరేలా మార్పు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

మత్స్య దిగుబడులు నేలచూపు..!

ప్రతికూల వాతావరణమే కారణం



జిల్లాలో ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు:	20
ఇంజిను బోట్లు:	1000
చేపలరేవులో మరపడవలు:	700
సంప్రదాయ పడవలు:	2,000 వరకు

న్యూస్‌టుడే, వన్‌టౌన్

ఈ ఏడాది మత్స్యకారులకు నిరాశ తప్పలేదు. తొలి ఆరు నెలలు తూర్పు తీరంలో మత్స్య దిగుబడులు సన్నగిల్లాయి. సీజన్ ఆరంభం నుంచి సముద్ర జలాల్లో ప్రతికూల వాతావరణం ఏర్పడుతుండడంతో చేపలవేటకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీని ప్రభావం దిగుబడులపై పడుతోంది.

ఈ ఏడాది సంద్రంలో వడి తీవ్రత కూడా అధికంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆశించిన స్థాయిలో సముద్ర ఉత్పత్తులు లభ్యం కావని ఆపరేటర్లు వాపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు అంటే మొదటి ఆరు నెలల్లో 55,627 టన్నుల మత్స్య ఉత్పత్తులు లభిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 54,747 టన్నులు మాత్రమే లభ్యం కావడం గమనార్హం.





తగ్గిన రొయ్యల ఉత్పత్తి..

విశాఖ జిల్లాలో సువిశాల సముద్ర తీరం విస్తరించి ఉంది. చెరువు, మంచినీటి రొయ్యలు, చేపల లభ్యత తక్కువ. సముద్ర ఉత్పత్తులే అధికంగా ఉంటాయి. గత ఏడాదితో పోల్చితే చేపల దిగుబడులు పెరిగినప్పటికీ, రొయ్యల దిగుబడి తగ్గింది. సముద్ర జలాల ద్వారా గత ఏడాది 15,618 టన్నుల రొయ్యలు దిగుబడి వస్తే ఈ సారి 13,479 టన్నులు మాత్రమే లభించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో ప్రారంభమైనప్పటికీ ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు వేట నిషేధం ఉంది. జూన్ 15 నుంచి కొత్తసీజన్ ప్రారంభమైంది.

● తూర్పు తీరంలో ఏయే ప్రాంతాల్లో మత్స్య సంపద ఉందో భారత మత్స్య పరిశోధన సంస్థ గుర్తించి మత్స్యకారులకు సమాచారం అందిస్తోంది. ఇది కొంత వరకు సత్ఫలితాలను ఇస్తోంది. కాని ఎప్పటికప్పుడు సముద్ర వాతావరణం మారిపోతుండడం, పైజలాలు వేడెక్కడంతో మత్స్యరాశులు బాగా లోతుకు వెళ్లిపోతున్నాయి. అయితే రానున్న నాలుగైదు నెలల్లో చేపల వేట ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని బోటు ఆపరేటర్లు చెబుతున్నారు. వాతావరణం చల్లబడితే దిగుబడులు పుంజుకుంటాయనే ఆశతో ఉన్నారు.

ప్రస్తుత ఏడాది మొదటి ఆరు నెలల్లో దిగుబడులు ఇలా..

ఉత్పత్తులు	దిగుబడులు (టన్నుల్లో)
సముద్ర చేపలు	31,269
రొయ్యలు	13,479
చెరువు చేపలు	9937
చెరువు రొయ్యలు	21.5
మంచినీటి రొయ్యలు	41.4

మొత్తం: 54,747.9

ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సందర్శన

సీతంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సిబ్బంది, వైద్యులను అడిగారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూడాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. అనంతరం బుల్లయ్య కళాశాల ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ విలేజ్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అందించిన మొక్కలను నేత్ర వైద్యశాల ఆవరణలో నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఆర్.ఎం.ఓ డాక్టర్ నవీన్ కుమార్, ఇతర వైద్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ఎముక ఆరోగ్యం.. జీవన సౌభాగ్యం..!



- గుల్లబారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- నేడు ఆస్టియో పోరోసిస్ దినోత్సవం

వన్‌టౌన్, న్యూస్‌టుడే

శరీరంలో అవయవాల కదలికలకు ఎముకలు చాలా ముఖ్యం. అవి బలహీన పడితే జీవితం నరకప్రాయమవుతుంది. అందుకే మధ్య వయసు నుంచే ఎప్పటికప్పుడు ఎముకల దృఢత్వం పరీక్షించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. వివిధ వ్యాధులు వాటికి శత్రువులుగా మారుతున్నాయి. వాటిల్లో ప్రధానమైనది ఆస్టియో పోరోసిస్. ఇటీవల కాలంలో కేజీహెచ్ ఎముకల విభాగానికి వస్తున్న కేసుల్లో ఈ వ్యాధితో బాధపడుతున్న వారు అధికంగా ఉంటున్నారని ఎముకల విభాగ ప్రొఫెసరు డాక్టర్ లాడి లోక్‌నాథ్ చెబుతున్నారు. మహిళలు అధికంగా ఈ వ్యాధి బారిన పడుతున్నారని వెల్లడించారు. ఆదివారం 'ఆస్టియో పోరోసిస్' దినోత్సవం. ఈ సందర్భంగా ఎముకలు గుల్లబారకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన వివరిస్తున్నారు.

ఈ వ్యాధి 50ఏళ్ల లోపు వారిలో కూడా కనిపిస్తోందని, దీనికి మారిన జీవన శైలి ఒక కారణమని వైద్యులు చెబుతున్నారు. వీరు ఫాస్ట్‌ఫుడ్ తినడం మానేసి కాల్షియం అధికంగా ఉండే సంప్రదాయ ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

వ్యాధి నిర్ధారణ ఇలా: బోన్ మినరల్ డెన్సిటి (బీఎండీ) పరీక్ష ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చు. ప్రస్తుతం ఇది కేజీహెచ్‌లో అందుబాటులో లేదు. ప్రైవేటుగా చేయించుకోవాలి. కేజీహెచ్ ఎముకల విభాగ ఓపీకి రోజుకు 400 మంది వరకు రోగులు వస్తున్నారు. వారిలో 30శాతం వరకు ఆస్టియో పోరోసిస్ బాధితులు ఉంటున్నారు. వీరికి చేసే శస్త్రచికిత్సలన్నీ సంక్లిష్టమైనవే అని ప్రొఫెసర్ ఎల్.లోక్‌నాథ్ పేర్కొంటున్నారు.



వ్యాధి బారిన పడడానికి కారణాలు ఇలా...

★ ఆస్టియో పోరోసిస్ వ్యాధి రెండు రకాలుగా ఉంటుంది. మహిళలకు మోనోపాజ్ తర్వాత.. 65 ఏళ్ల ఆపైన ఎముక సాంద్రత క్రమంగా తగ్గితే వచ్చే ఆస్టియో పోరోసిస్‌ను ప్రైమరీ వ్యాధిగా పరిగణిస్తారు.

★ దీర్ఘకాలిక వ్యాధులైన కిడ్నీ, కాలేయం, కొన్ని రకాల జీర్ణకోశ వ్యాధులు, రుమటాయిడ్, థైరాయిడ్, మధుమేహం, జన్యుపరమైన కారణాలు, ఫిట్స్, స్టెరాయిడ్స్, హెపారిన్ మందులు దీర్ఘకాలం వాడడం, అధికంగా ఆల్కహాలు తీసుకోవడం, పొగతాగడం, శారీరక శ్రమ లేకపోవడం, అతి తక్కువ బరువు, కాల్షియం, విటమిన్ డి లోపం కారణంగా వచ్చే ఆస్టియో పోరోసిస్‌ను సెకెండరీగా పరిగణిస్తారు.

50 ఏళ్లు పైబడిన ప్రతి ముగ్గురు స్త్రీల్లో ఒకరు, ప్రతి 8 మంది పురుషుల్లో ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు.



కేజీహెచ్‌లోని ఎముకల వార్డు

ఇవి పాటిస్తే మేలు..

★ బాధితులు శరీరాన్ని సాధ్యమైనంత వరకు చురుగ్గా ఉంచుకోవాలి.

★ నిత్యం 20 నుంచి 30 నిమిషాల సేపు నడవాలి. తేలికపాటి వ్యాయామం చేయాలి.

★ పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, మాంసం, తృణధాన్యాలు, చేపలు, గుడ్డు లాంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలి.

★ వృద్ధులు జారి పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తమ పడక గదులు, బాత్‌రూమ్స్‌లో మంచి కాంతి ఉండేలా చూసుకోవాలి.

ఆంధ్ర ఆసుపత్రిలో ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర హాస్పిటల్స్ విశాఖపట్నం, హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే ఛారిటీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు పిల్లలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు ఆసుపత్రి సంచాలకుడు డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. ఆంధ్ర హాస్పిటల్స్ వైద్య నిపుణులు, ఇంగ్లండ్ నుంచి వచ్చిన వైద్యుల బృందం ఈ శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. విజయవాడ ఆంధ్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 30 శిబిరాలు విజయవంతంగా నిర్వహించామని, 4వేల గుండె శస్త్ర చికిత్సలు చేసిన అనుభవంతో విశాఖలో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఇతర వివరాలకు 88866 79733, 0891 2724777 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



ఆలయ కమిటీకి చెక్కు అందిస్తున్న దాతలు

ఆలయ నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : అక్కిరెడ్డిపాలెం గ్రామ ఆరాధ్య దేవతలైన దుర్గమాంబ- కుంచమాంబ ఆలయాల నిర్మాణానికి గ్రామంలోని సంధ్రాన లక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్, దివంగత సంధ్రాన రమణమ్మ దంపతుల కుమారులు రూ.6,00,001ల విరాళం ప్రకటించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ ప్రతినిధులకు విరాళ చెక్కు అందించారు. దాతలను కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

అన్నప్రసాద పథకానికి రూ.3 లక్షల విరాళాలు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి శనివారం ముగ్గురు స్నేహితులు విరాళాలు సమర్పించారు. పాత గాజువాక దరి చినగంట్యాడకు చెందిన ఈసర్ల చినఅప్పలనాయుడు, సూర్యకళ.. కూర్మన్నపాలేనికి చెందిన సామకూరి సింహాద్రిబాబు, విజయలక్ష్మి.. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన కట్టవరపు కృష్ణ, కోమల దంపతులు శనివారం రూ.1,00,116 చొప్పున రూ.3,00,348 విరాళంగా సమర్పించారు. సంబంధిత చెక్కును దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావుకు అందజేశారు. దాతలకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ప్రోటోకాల్ పర్యవేక్షకుడు విక్రమ్ పాల్గొన్నారు.



ఈవో త్రినాథరావుకు విరాళాల చెక్కులు అందిస్తున్న దాతలు



పూజలో పాల్గొన్న రాజేటి శ్రీరామాచార్యులు, నిర్వాహకులు

మాలధారణ భక్తులకు అన్న ప్రసాద వితరణ ప్రారంభం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పోర్టు ఆసుపత్రి ఎదురుగా ఖాళీ స్థలంలో యెరుమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మాలధారణ భక్తులకు 45 రోజుల పాటు నిర్విరామ 'భిక్ష' ఘనంగా ప్రారంభమైంది. శనివారం ప్రారంభమైన కార్యక్రమంలో కశింకోటకు చెందిన రాజేటి శ్రీరామాచార్యులు ముఖ్యఅతిథిగా హాజరై తొలి పూజ కార్యక్రమాలను చేశారు. అనంతరం ఆయన అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ తొలిరోజు వేలాది మంది మాలధారణ ధరించిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. డిసెంబరు 2వ తేదీ వరకు 45రోజుల పాటు ఇక్కడ భిక్ష లభిస్తుందన్నారు.

ది మహారాజ బ్యాంకుకు జాతీయ అవార్డు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ది మహారాజ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు జాతీయ స్థాయి వ్యాపార పోటీలో 'బెస్ట్ కేవైసీ ఇన్షియేటివ్' అవార్డు లభించింది. ఫ్రంటీయర్స్ ఇన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, జనరల్ మేనేజర్ ఎం.మురళీకృష్ణవర్మ అవార్డు అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకుల ఛైర్మన్ ఎస్‌హెచ్ లక్ష్మీదాస్ విచ్చేశారు. బ్యాంకింగ్ ఫ్రంటీయర్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ బాబు నాయర్, ఇతర ప్రతినిధులు మనోజ్ అగర్వాల్, మదన గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు

రైల్వేలో భద్రతపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సంఘం సమన్వయకర్త రమేష్‌బాబు, చిత్రంలో సంఘం ప్రతినిధులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రైల్వేలో భద్రతను నిర్లక్ష్యం చేస్తూ ప్రజల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమన్వయకర్త డి.రమేష్‌బాబు ఆరోపించారు. శనివారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో 40 రైలు ప్రమాదాలు జరగ్గా 313 మంది ప్రయాణికులు, నలుగురు రైల్వే ఉద్యోగులు మృతి చెందారన్నారు. రైల్వేలో 3లక్షల ఖాళీ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేసి ఒప్పంద ఉద్యోగులపై పని భారం తగ్గించాలని కోరారు. భద్రతా విభాగంలో శిక్షణ పొందిన కార్మికులు కాకుండా, ప్రయివేటు వ్యక్తులతో పనులు చేయించడం దారుణమన్నారు. రైల్వేలో 5లక్షలకు పైగా ఒప్పంద కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఎం.సాయిబాబు, ఉమామహేశ్వరరావు, నరసింహులు, ఆర్‌కెఎస్‌వీ కుమార్, బి.జగన్, ఒ.అప్పారావు పాల్గొన్నారు.

'ఈనాడు' లక్ష్య క్రీడాకారులకు పతకాలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: 35వ సౌత్‌జోన్ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో 'ఈనాడు' లక్ష్య క్రీడాకారులు పతకాలు గెలుపొందారు. పోటీలు శనివారం గుంటూరులో ముగిశాయి. డి.శేష 200 మీటర్ల పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్యం, మిడ్లే రిలేలో రజతం.., ఎం.హరీష్ 3వేల మీటర్ల పరుగులో స్వర్ణం, 10 కిలోమీటర్ల పరుగులో కాంస్యం.., బి.హరీష్ మూడు కిలోమీటర్ల వాక్‌రేస్‌లో రజతం.., సిహెచ్.సాయికిరణ్ 60 మీటర్ల పరుగులో కాంస్యం, ఆర్.భారతి, ఎస్.కె.బషీర్‌లు 4×400 మీటర్ల రిలేలో కాంస్య పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా పతక విజేతలకు కోచ్‌లు పి.పుష్పరాజు, కె.బ్రహ్మాజీ, ఎం.హరీష్ అభినందించారు.





పతకాలు గెలుపొందిన క్రీడాకారులు

ఉపాధి శిక్షణకు ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే : స్కిల్ డెవలప్‌మెంట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ సహకారంతో ఉచితంగా శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఈడీ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ తదితర కోర్సులపై ఆసక్తి ఉన్న వారికి ద్వారకానగర్‌లో మూడు నెలల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో వసతి, ఏకరూప దుస్తులు, పుస్తక సామగ్రి, అందిస్తామన్నారు. ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్ల యువతీ, యువకులు అర్హులన్నారు. ఇతర వివరాలకు 91219 99654 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నగదు ఉపసంహరణపై విచారణకు డిమాండ్

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ఉద్యోగుల ఎరన్డ్ లీవ్స్ (ఈఎల్స్) ఫండ్ నుంచి కొంత సొమ్మును అనధికారికంగా ఉపసంహరిచడంపై విచారణ జరిపించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం ఉక్కు సీఎండీకి లేఖ అందించారు. ఈ ఏడాది మే నెల నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారికి ఈఎల్స్ పేమెంట్ చెల్లించలేదని, రూ.390 కోట్ల వరకు ఖాతా నుంచి ఉపసంహరించారని వివరించారు. అలాగే పీఎఫ్, ఎస్‌బీఎఫ్, ఈఎఫ్‌బీఎస్, ఉద్యోగ విరమణ చేసి ఉద్యోగుల ఫండ్, మరణించి ఉద్యోగుల కుటుంబ ప్రయోజన పథకం ఫండ్, ఉద్యోగుల పొదుపు తదితర ఖాతాలకు చెల్లించాల్సిన సుమారు రూ.900 కోట్ల చెల్లింపులు నేటికీ జరక్కపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని సంఘం అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు, సహాయ ప్రధాన కార్యదర్శి జె.వి.నరేష్‌కుమార్ కోరారు.

విద్యార్థి మృతి... కుటుంబ సభ్యుల ఆందోళన

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ చంద్రపాలెం దరి ఓ ప్రయివేటు కళాశాలలో అనారోగ్యంతో విద్యార్థి మృతి చెందిన ఘటన ఇది. ఎస్‌ఐ కె.భాస్కర్ తెలిపిన వివరాలిలా.. విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలో అలజంగి గ్రామానికి చెందిన బి.సూర్యనారాయణ వ్యవసాయం చేస్తుంటారు. ఆయన పెద్ద కుమారుడు బడిబాను ప్రకాశ్ (16) మధురవాడ చంద్రపాలెంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం అనారోగ్యంగా ఉండటంతో బాలుడిని మిథిలాపురి వుడా కాలనీలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. యాజమాన్యం తక్షణం స్పందించకపోవడం వల్లే ప్రకాశ్ చనిపోయాడని ఆరోపించారు.

మనస్తాపంతో బాలుడి బలవన్మరణం

మాధవధార, న్యూస్‌టుడే: చెడు అలవాట్లకు బానిస కావొద్దు, బుద్ధిగా చదువుకోవాలని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన ఒక బాలుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐ.టి.ఐ జంక్షన్ తుమ్మడపాలెం వద్ద నివాసం ఉంటున్న బాలుడు (16) ఈ ఏడాది పదో తరగతి పాసయ్యాడు. ఆ తర్వాత కాలేజీ చదువులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతూ, నిరంతరం ఫోన్లు చూస్తూ, చెడు అలవాట్ల వైపు వెళ్తున్నాడు. దీంతో గత కొన్ని రోజులుగా తల్లి మందలిస్తోంది. శుక్రవారం రాత్రి కూడా ఇంటికి ఆలస్యంగా రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అతడు నిద్రిస్తానని ఇంటి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. కొంత సమయం తర్వాత అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా చీరతో ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకొని ఉన్నాడు. వెంటనే తల్లి ఇతరుల సహాయంతో కిందకి దించి, ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన బాలుడికి తండ్రి, తల్లి, సోదరుడు ఉన్నారు. తల్లిదండ్రులు గొడవల వల్ల వేర్వేరుగా ఉంటున్నారు. కుమారుడు తల్లితో కలిసి ఉంటున్నాడు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

పెందుర్తి

రహదారి విస్తరించాలని విజ్ఞప్తి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం కూడలి నుంచి తంతడి వరకు ఉన్న రహదారిని విస్తరించాలని భాజపా నాయకుడు బండారు రామునాయుడు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రహదారిని విస్తరించి వాహనచోదకులు కష్టాలు తీర్చాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి: 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెంలోని బీసీ వసతి గృహానికి వెళ్లే దారిలో కాలువ లేక మురుగు నిలిచిపోయి తిష్ట వేస్తోంది. దుర్వాసన, దోమలతో రోగాలు వస్తాయని భయమేస్తోంది. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కాలువ నిర్మించాలి.
– జి.ఎ.నాయుడు, మల్లునాయుడుపాలెం

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కాలువ నిర్మాణానికి కృషి చేస్తాం.
– బోని దేముడమ్మ, సర్పంచి, మల్లునాయుడుపాలెం

కాదిది పచ్చని మైదానం

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలో రహదారిని ఆనుకుని ఉన్న చెరువు అధ్వానంగా తయారైంది. చెరువులోకి వ్యర్థాలు చేరడంతో పాటు నాచు పెద్దఎత్తున పేరుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు. దోమల బెడద ఎక్కువవడంతో రాత్రుళ్లు కంటినిండా నిద్ర కరవవుతోందని ఈ తటాకానికి దగ్గరగా ఉన్న నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. చెరువు ఈ దుస్థితికి చేరినా పట్టించుకునేవారే కరవయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చెరువును శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నాచుపట్టి అధ్వానంగా తయారైన చెరువు

‘బోరు’ మంటున్నాయి..


ప్రహ్లాదపురం మోదీస్ట్రీట్ సమీపంలో..

ఒకప్పుడు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు హుద్‌హుద్ లాంటి సమయంలో ఎంతో ఉపయోగపడిన చేతిబోర్లు నేడు మరమ్మతులకు నోచుకోక బోరుమంటున్నాయి. జీవీఎంసీ జోన్-8 పరిధిలోని మంచినీటి బోర్లు చాలావరకు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అవి తుప్పుపట్టి పాడవ్వడంతో పాటు మరికొన్ని చోరీకి గురవుతున్నాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. జోన్ పరిధిలో దాదాపు సగానికి పైగా బోర్లు మరమ్మతులకు గురయ్యాయి.

– న్యూస్‌టుడే, వేపగుంట

ఏటా వేసవికి ముందు తవ్వకం..

ప్రతి ఏటా వేసవి వస్తున్న తరుణంతో మంచినీటి ఎద్దడిని అరికట్టేందుకు వార్డుల్లో అవసరమైన చోట మంచినీటి బోర్లను తవ్విస్తున్నారు. ‘వేసవి ప్రత్యేక ప్రణాళిక’ అంటూ వార్డుకి కనీసం 4 నుంచి 5 బోర్లు వరకు తవ్వుతున్నారు. అలా వేసిన బోర్లను చాలావరకు వినియోగించకుండానే ఉండిపోతున్నాయి. దీనికి కారణం ప్రతీ ఇంటికి ఇంటింటి కుళాయి ఉండటమే. అత్యవసరంలో ఉపయోగపడతాయని వేయిస్తున్న బోర్లు అక్కరకు రాకుండా పాడైపోయి మూలకు చేరుతున్నాయి. కనీస నిర్వహణకు నోచుకోక దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి.


విరాట్‌నగర్‌లో..


సింహపురి కాలనీ శివారులో మరమ్మతులకు గురైన మంచినీటి బోరు

రూ. లక్షల రూపాయల ప్రజాధనం వృథా

సుమారు రూ.లక్షన్నర ఖర్చు..

జీవీఎంసీ పరిధిలో తవ్వే ఒక్కో బోరుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఖర్చవుతోంది. మరికొన్ని చోట్ల లోతు తవ్వితే ఇంకా ఎక్కువ ఖర్చవుతోంది. తవ్వేశాం మన పనైపోయిందన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రతీవార్డులో ఎక్కడెక్కడ మంచినీటి బోర్లు పాడై ఉన్నాయో గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడితే ప్రజాధనాన్ని కాపాడిన వారవుతారని ప్రజలు అంటున్నారు. జోన్-8 పరిధిలోని పెద్ద పెద్ద కాలనీల్లో కనీసం నాలుగుకి తగ్గకుండా బోర్లు పాడైపోయాయి. వాటిని ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో కొంతమంది పైభాగాలను చోరీ చేశారు. కుళాయిల సరఫరా ఆగినపుడు ఈ బోర్లే దిక్కు అని పలువురు వాపోతున్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వినతి

పరవాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ(ఎస్‌జీటీ) పోస్టులను భర్తీ చేయాలని జీవీఎంసీ 77వ వార్డు తెదేపా మైనార్టీ సెల్ నాయకుడు సర్దార్ ఆలం రాజా కోరారు. ఈ మేరకు విశాఖలో శనివారం మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ఒక్క ఉర్దూ ఉపాధ్యాయ పోస్టు కూడా మంజూరు చేయలేదన్నారు. సుమారు 100 మంది పైగా ఉర్దూ శిక్షణ పూర్తి చేసుకుని టెట్ కూడా అర్హత పొంది ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి తీసుకుని ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విన్నవించారు.

పల్లెల్లో పూర్తిస్థాయి వసతులు: ఎమ్మెల్యే

పరవాడ, న్యూస్‌టుడే: పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధిపథంలో రూపుదిద్దుకుంటాయని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, రావాడ, కలపాక, ఈ.బోనంగి పంచాయతీల్లో రూ.కోట్ల రూపాయలతో నిర్మించనున్న సీసీరోడ్లు, కాలువ పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించి ప్రజల కష్టాలను తీర్చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత వైకాపా పాలనలో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పల్లె పండగ అభివృద్ధి పనులను డిసెంబరు 31లోగా పూర్తి చేస్తామన్నారు. అనంతరం గొర్లెవానిపాలెం పోర్టుకో లేఅవుట్‌లో తీర్చిదిద్దిన మహాత్మాగాంధీ చిల్డ్రన్ పార్కును ఎమ్మెల్యే పంచకర్ల ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, తహసీల్దార్ అంబేడ్కర్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ముత్యాలమ్మపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

చిరువ్యాపారిపై కానిస్టేబుల్ దాడి

పెందుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన టిఫిన్ దుకాణం నడుపుకొనే చిరువ్యాపారిని ఒక కానిస్టేబుల్ కొట్టిన ఘటన పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి బాధితుడు, పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట దరి కృష్ణరాయపురం వద్ద మహేశ్ అనే వ్యక్తి టిఫిన్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈయన దుకాణం సమీపంలోనే ఒక బహుళ అంతస్తుల భవనం ఉంది. అందులో నివాసం ఉండే గణేశ్ అనే వ్యక్తి దుకాణం వల్ల అపార్టుమెంటు వాసులకు ఇబ్బందికరంగా ఉందని శుక్రవారం రాత్రి మహేశ్‌తో గొడవపడ్డారు. ఆ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం గణేశ్ అనకాపల్లి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఆనంద్‌ప్రసాద్‌ను మహేశ్ దుకాణం వద్దకు పిలిపించారు. ఆనంద్‌ప్రసాద్ తాను పెందుర్తి హెడ్‌కానిస్టేబుల్ అని చెప్పి మహేశ్‌ను హెచ్చరించారు. మాటామాటా పెరగడంతో మహేశ్‌పై ఆనంద్‌ప్రసాద్ చేయి చేసుకున్నారు. ఆ మేరకు బాధితుడు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాలను పిలిపించి మాట్లాడుతున్నట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు.

కూరగాయల ధరలు తగ్గించాలని ధర్నా

వేపగుంట, న్యూస్‌టుడే: కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వేపగుంట కూడలిలో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి తమ డిమాండ్లతో కూడిన కరపత్రాలను పంచారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు చేపట్టిన నిరసనలో జిల్లా కమిటీ నాయకులు ఆర్.శ్రీను, మహిళా నాయకులు అన్నపూర్ణ, అరుణ మాట్లాడుతూ మద్యం ధరల నియంత్రణపై ఉన్న ఆసక్తి నిత్యావసర ధరలు తగ్గింపుపై కూటమి ప్రభుత్వానికి ఎందుకులేదని ప్రశ్నించారు.


వేపగుంటలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

వేగ నిరోధకాలపై తెలుపు రంగు వేయాలి

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట బీఆర్టీఎస్, ప్రహ్లాదపురం రహదారుల్లో ఇటీవల జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నిర్మించిన వేగనిరోధకాలపై వెంటనే తెలుపు రంగు వేసి, రేడియం స్టిక్కర్లు అతికించాలని డిమాండ్ చేస్తూ బాలాజీగార్డెన్ మహిళలు శనివారం వేగనిరోధకాల వద్ద నిరసన తెలిపారు. వేగనిరోధకాలు నిర్మించడం తప్పుకాదని కనీస ప్రమాణాలు పాటించకుండా పనులు చేశారని మహిళలు ఆరోపించారు. రాత్రుళ్లు ఇవి కనిపించకపోవడంతో వాహనదారులు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. శుక్రవారం రాత్రి ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెళ్తూ తీవ్రగాయాలపాలయ్యారన్నారు. వెంటనే జీవీఎంసీ, పోలీసు అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.మాధవీలత ఆధ్వర్యంలో మహిళలు పాల్గొని నిరసన తెలిపారు.


వేగ నిరోధకాల వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

నేరాలపై అప్రమత్తత అవసరం

పెందుర్తి, న్యూస్‌టుడే: సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి నేర విభాగం ఎస్ఐ డి.సూరిబాబు పేర్కొన్నారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో శనివారం సాయంత్రం నేర నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇటీవల శివారు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, ఇళ్లల్లో, దేవాలయాల్లో, ఒంటరి మహిళలపై జరుగుతున్న దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీల్లో, అపార్టమెంట్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. అనుమానితుల కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నేర విభాగం ఎస్ఐ సూరిబాబు

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి



వ్యాసరచన పోటీలో పాల్గొన్న శ్రీచైతన్య విద్యార్థులు; విజేతలకు బహుమతులందిస్తున్న ప్రిన్సిపల్ తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు

‘ఈనాడు’ ఆధ్వర్యంలో శనివారం పెందుర్తిలోని శ్రీచైతన్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ‘అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం’ అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిపారు. ప్రతిభ చూపిన ముగ్గురేసి విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ★ పెందుర్తిలోని శ్రీచైతన్య పాఠశాలలో సీహెచ్.గణేశ్, ఇ.గీతికా ప్రసన్న, యు.నేహాల్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ పి.తారకేశ్వరరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ★ పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్.లక్ష్మణ్, టి.మేఘన, ఎ.దశ్వంత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి ప్రశంసాపత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, పెందుర్తి



పరీక్ష రాస్తున్న పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు; గెలుపొందిన వారికి బహుమతులిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు చిన్నమ్మాయి, ఉపాధ్యాయులు

తిక్కవానిపాలెం తీరంలో స్వచ్ఛతాహీ సేవ

పరవాడ, న్యూస్‌టుడే: పరిసరాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ అన్నారు. తిక్కవానిపాలెం తీరంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని తద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి తీరంలో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న అధికారులు

నేడు భీమిలిలో జిల్లా స్థాయి పోటీలు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షులు, విశ్రాంత ప్రిన్సిపల్ కాళ్ల సూర్య రామకృష్ణారావు తెలిపారు. భీమిలిలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం వేదికగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నా ఒంటి గంట వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం, విజయాలు, వైఫల్యాలు, ప్రపంచ శాంతి, భద్రతా సమితి వైఫల్యాలు, తదితర అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 89856 47419 నంబరును సంప్రదించాలన్నారు.

ట్రూఅప్ ఛార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి: సీపీఎం


వేపగుంటలో ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

వేపగుంట, న్యూస్‌టుడే: ట్రూఅప్ పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బలివాడ వెంకటరావు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం కార్యకర్తలు శనివారం ధర్నా జరిపారు. స్మార్ట్‌మీటర్లు, ఇంధనం సర్దుబాటు అంటూ ప్రజల నెత్తిన ఛార్జీల భారం మోపడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. సీనియర్ నాయకుడు పెతకంశెట్టి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ కట్టబెట్టారని ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ముద్దాడ వరప్రసాదరావు, పి.అనసూయ, ఎ.గోవిందరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల సీపీఎం నేత ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.ప్రభావతి మాట్లాడుతూ వైకాపా పాలనలో సుమారు 8 పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారన్నారు. పెంచిన ఛార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. 2023-24లో నూతన చట్టం ఆధారంగా ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. సీపీఎం నాయకులు ఎం.గౌరేసు, కోటి, ఎర్రా సోంబాబు తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

శ్రీనివాసుడికి వైభవంగా తోమాల సేవ


వేంకటాద్రిపై కొలువైన శ్రీనివాసుడు


తులసిమాలల అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడికి శనివారం తోమాల సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాల భోగం సేవలు నిర్వహించారు. వివిధ వర్ణాల పూలు, తులసిమాలలతో కలియుగ దైవాన్ని అలంకరించి సహస్రనామార్చన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట దరి రవినగర్ శేషాద్రి శిఖరంపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరుడికి తులసి మాలలతో అర్చన చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి 108 బంగారు పుష్పాలతో అర్చన జరిపారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రతినిధులు ప్రసాద వితరణ చేశారు.


ఈ.భోనంగి వేంకటేశ్వరుడు

ఆకట్టుకున్న దీపారాధన

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం దరి సింహాచలం ఆర్టీసీ డిపోలో జరుగుతున్న దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ప్రతిమ ముందు దీపారాధన చేశారు. మహిళా కండక్టర్లు, స్థానికులు అమ్మవారికి పుష్పాలంకరణలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం దుర్గాదేవి నిమజ్జనోత్సవం ఉంటుందని ఉద్యోగులంతా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.


మహిళా కండక్టర్లు వెలిగించిన దీపాలు

నిర్లక్ష్యపు వెలుగులు



విద్యుత్‌ను పొదుపుగా వాడి ఆదా చేయాలని తరచూ అవగాహన కల్పిస్తున్న ఆ శాఖ అధికారులు వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నా పట్టించుకోవడం లేదు. పరవాడ మండలం గొర్లెవానిపాలెం జెఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ముఖద్వారం వద్ద, పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న హైమాస్టు దీపాలు శనివారం పట్టపగలే విద్యుత్ వెలుగులు విరబూస్తున్నాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా నిరంతర వెలగడంతో విలువైన విద్యుత్‌ను వృథా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. పట్టపగలు దీపాలు వెలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పరవాడ

మొరాయిస్తున్న లారీలు

పరవాడ, న్యూస్‌టుడే: మండలంలోని రహదారులు గుంతలతో అధ్వానంగా తయారవ్వడంతో తరచూ లారీలు మొరాయిస్తున్నాయి. పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో శనివారం ఓ లారీ మొరాయించింది. అచ్యుతాపురం నుంచి పరవాడ మీదుగా విశాఖ వెళ్తున్న లారీ సరిగా కూడలి వద్దకు వచ్చేసరికి గోతుల్లో ఆగిపోయింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే కూడళ్లలో భారీ లారీలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గుంతల కారణంగా నిలిచిపోయిన లారీ

గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్

కలపాక(పరవాడ), న్యూస్‌టుడే: రెవెన్యూ గ్రామసభలతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్ అన్నారు. కలపాక సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న గ్రామసభలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీసర్వేలో ఎటువంటి లోపాలు ఉన్నా వెంటనే అర్జీలు పెట్టుకోవాలన్నారు. అనంతరం భూ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన 71 అర్జీలను స్వీకరించారు. కలపాక రెవెన్యూలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని పలువురు రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి బొండా కనకారావు, ఎంపీటీసీ సభ్యురాలు సప్ప ప్రభ, నాయకులు నగిరెడ్డి చిన్నారావు, ఇందల కొండలరావు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సదస్సులకు ఆదరణ పెరుగుతోందని తహసీల్దారు చిన్నికృష్ణ తెలిపారు. అసకపల్లిలో నిర్వహించిన సమావేశానికి 81 దరఖాస్తులు వచ్చాయన్నారు. సాధ్యమైనంత తొందరలో దరఖాస్తులు పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అసకపల్లిలో రీసర్వేకు ముందు 550.76 ఎకరాల పట్టా భూమి ఉండగా రీసర్వే అయిన తరువాత కూడా అంతే భూమి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి రైతులకు 2900 ఎల్‌పీఎంలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రీసర్వే ఆర్ఐ గణేశ్, రెవెన్యూ సిబ్బంది మోహనరావు, ఈశ్వరరావు, కామరాజు, రవితేజ శ్రీనివాస్, సర్పంచి కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


అసకపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్బవరం తహసీల్దారు చిన్నికృష్ణ

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2018 Model Honda City 1.5 VX Petrol Dr. Driven Good Condition Car for sale. Contact No: 9491802728, 9912284850.

Suzuki Dezire 2016. White Colour, Doctor owner Car for Sale. Contact: 9603090246.

Maruti SCross Diesel high-end model 2016, 80000 km Single owner for Sale. New Tyres, Battery. Contact: 8328174653.

Swift Hatchback Diesel Car 2010 Model. Price 3Lakhs. Contact: 8074468251/ 7670902815. No Agents.

DRIVING SCHOOLS

Leo Lady Driving School. How to Learn 2 & 4 Wheelers in easy tips. Professional Lady Instructor at ur Convenience time & Place (Pickup & Drop). ✆ 9866372668.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్ / ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులో తనఖా ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును మిగిలిన డబ్బు తక్షణమే ఇవ్వబడును. స్పాట్ క్యాష్ EV. Golds 7075086333.

WANTED DEALERS/AGENTS

AP ప్రభుత్వంచే ఆమోదం పొందిన ఇసుక లారీ / ట్రాక్టర్‌లకు GPS అమ్మేందుకు డీలర్లు కావలెను.
కంపెనీ వారి సంప్రదింపు నంబర్లు:
Volty IoT Solutions
8367307070
9666841234

BUSINESS OFFER

Wanted Business Partners, Commission based Business, No Loss, You can supply directly. Cond. apply. Contact only on Whatsapp 9173425677.

WANTED JUNIOR COLLEGE PARTNERSHIP (OWNER/OPERATOR)
Proposals for College Management and Operations are welcome.
No.1 Educational Institutions at located VISHAKHAPATNAM
Seeking an ethical partner for college ownership and management.
Office Address: opp: Pollock School , Beside JK Tyres , Shanakaramatam Road, VSP.
✆ 6305050988 / 9666522377

వైజాగ్ కూర్మన్నపాలెంలో మంచి రన్నింగ్‌లో ఉన్న ప్రముఖ రెస్టారెంట్ తక్కువ రేటుకే అమ్మబడును. సంప్ర: 81797 25159, 99940 10361.

Options & Futures ట్రేడింగ్ నేర్చుకొని మీ ఇంటి నుంచే బిజినెస్ చేసే అవకాశం. క్లాసెస్ న్యూ బ్యాచ్ ప్రారంభం @ 23rd అక్టోబర్. వివరాలకు. 8885683745.

తగరపువలసకి 3.5 కి.మీ. దూరంలో తారురోడ్డు ఫేసింగ్ 25 సెంట్లు స్థలంలో రైస్ మిల్లు నెలకు లక్ష రూపాయలు రాబడితో రన్నింగ్‌లో అమ్మబడును. పసుమర్తి వెంకటరాజు. 9949319282.

స్టాక్ మార్కెట్లో కొత్తగా ప్రవేశించేవారు బేసిక్స్ నుండి ఫండమెంటల్ మరియు టెక్నికల్ అనాలసిస్ నేర్చుకొని డైలీ, మంత్లీ, దీర్ఘకాలిక లాభాలను పొందుటకు సంప్ర: 7780673021.

FOR SALE

Good Running spacious Super Market in Commercial & Residential locality at Sujathanagar 80 Ft. Rd., Vizag for Sale. Genuine Parties Contact: 8106625478.

CONSULTANCY SERVICES

Learn Making-Free Hand, Sketches to Interiors of Apartment Flats, Hotel Interiors, Malls, Where a Sketch can Convert to ✆ 9177755268.

BUILDING CONSTRUCTION

For Construction of Foundations & Compound walls for your open plots in & Around, Vizag. Contact: 9666967549.

uPVC
Windows & Doors
SERVICE
Contact:
7901234345

మీకున్న స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వబడును. నీళ్ల బోర్ నుండి గృహప్రవేశం వరకు సీలింగ్, పుట్టి చ.గు. 1850/- లే అవుట్స్ & అపార్ట్‌మెంట్ డెవలప్మెంట్ కొరకు సైట్స్ కావలెను. ✆ 97055 85003.

TDR
AP & TELANGANA
BONDS
BUY & SALE
KAMESH
92 92 15 15 15

WATER PROOFING

27 సం॥ Exp. తో బాత్‌రూమ్ టైల్స్ తీయకుండా, టీసీ, శ్లాబ్‌లీకేజ్, వాల్‌క్రాక్స్, ప్రెజర్ గ్రౌంటింగ్ అన్ని లీకేజీలు, చెదలు, బొద్దింకలు పెస్ట్‌కంట్రోల్ గ్యారంటీతో. ✆ 9676276693.

లైఫ్ టైమ్/ లాంగ్ టైమ్. అన్నిరకాల స్లాబులకు హీట్ ప్రూఫ్ & లీక్ ప్రూఫ్ ట్రీట్‌మెంట్ కలదు. స్లాబ్ జాయింట్స్ & క్రాక్స్, బాత్‌రూమ్, సీపేజ్ లీక్స్, వాటర్ ట్యాంక్స్, రెయిన్ వాటర్ లీక్స్ మొ॥ వాటికి ISO సర్టిఫైడ్ & 33 సం॥ అనుభవం ఉన్న సంఘమిత్ర బిల్డింగ్ డాక్టర్‌తో రూట్ ట్రీట్‌మెంట్ చేయించుకోండి. ఫోన్: 0891-2767676, 9393900900

EDUCATION

Online Computer Classes C, C++, DS, Java, PYTHON, MYSQL, ORACLE, PHP, HTML, CSS, Auto- Cad, MS-Office. Contact. 9494189706.

Wanted to get Authorised Training Centre of JNNYCCET for Fire Safety. Hotel Management, Computer & Beautician Courses? Contact: Prasad 8919058186. www.jnnyc-cet.org

TUITIONS

SDA: Tuitions: Inter & CBSE 11/12 MPC./BiPC & EAPCET/ Engineering & Polytechnic all Branches PM Palem. Ph: 8309911733

Engineering Tuitions: BE, B.Tech, Polytechnic, B.Sc. B.Com, Inter, CBSE, ICSE (6-10th) Spoken English/ Hindi, C, C++, Java, Python. Ph: 9347046459.

GVL Classes : Maths, Physcis, Chemistry Courses Offered - IIT-JEE Mains, NEET EAMCET & Inter IPE , Akkayyapalem, Highway Saibaba Temple. ✆ 8328615324.

COACHING CENTRES

Learn German Language Online/ Offline for Students & Working Professionals with Free Career Guidance. Ph.: 7995881671.

SPOKEN HINDI

Learn Online / Offline Spoken Hindi / English & French within 30 Days. 100% Guarantee for all Ages. Free Demo. ✆ 98495 42456.

HOME TUITIONS

IIT-JEE Maths Home Tui/ Tui (Exp. 15 Yrs.) 6th to 10th, +1, +2, Inter, Engg Maths (2003-2024) P.Y.Q. (IIT) Material Soln., available. Ct.: 7989090341.

ELITE Home Tutions: CBSE / ICSE/ STATE 1-10 th & Intermediate +1, +2 All subjects and Best faculty is Provided Call ✆ 9490769067, 9398449274.

FINANCIAL SERVICES

G/P Bank's Loans ఇంటి కొనుగోలు & నిర్మాణంపై Home Loan's ROI 9%, ఫంక్షన్ హాల్ & గోడౌన్స్ పై BIG LAP ROI 11%, అగ్రికల్చర్ ల్యాండ్, రేకుల షెడ్డు, ఖాళీ స్థలం, బిల్డింగ్‌పై Mortgage లోన్స్ ROI 10.5, ఓడీస్ & Govt. & Pvt ఎంప్లాయిస్‌కు Personal Loan ROI 10%, చిన్న పెద్ద వ్యాపారులకు Unsecured Business Loan's. T&C అప్లై. Call me ✆ 85005 58766.

FOOD

CATERING SERVICES

కనకమహాలక్ష్మి కేటరింగ్ (వైజాగ్) వివాహాది శుభకార్యములకు, ఇతర ఫంక్షన్‌లకు క్వాలిటీ ఫుడ్, క్యాటరింగ్ కొరకు సంప్రదించండి. K.S.ప్రసాద్, మద్దిలపాలెం. ✆ 9346304680, 9247129764.

HOME NEEDS

3) **స్థితిస్థాపక నిరోధక సిద్ధాంతం:** హెచ్.ఎఫ్.రీడ్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పలకలు సాపేక్ష చలనాలు కలిగి ఉన్నప్పుడు శిలలు తట్టుకోలేనంతగా వికృతి బలం వృద్ధి చెందుతుంది. ఈ బలం శిలల ప్రతిఘటన శక్తిని మించినప్పుడు శిలలు విచ్ఛేదనం చెంది అల్ప వికృతి బలం స్థానానికి చేరుకుంటుంది. ఈ సిద్ధాంతానికి 'స్థితిస్థాపక నిరోధక సిద్ధాంతం' అని పేరు.

4) **పాతాళ సంబంధమైన కారణాలు:** వీటి వల్ల భూకంపాలు చాలా అరుదుగా వస్తాయి. భూ అంతర్భాగంలో కలిగే రేడియో ధార్మిక విచ్ఛిత్తి, రసాయనిక చర్యలతో జరిగే మార్పులు దీనికి కారణాలు. ఇవి భూఉపరితలానికి 24 కి.మీ. నుంచి 640కి.మీ. లోతు వరకు సంభవిస్తాయి.

5) **పలక విరూప కారకాల సిద్ధాంతం:** ప్రపంచంలోని శక్తిమంతమైన భూకంపాలు విరూప కారక బలాల వల్లే వస్తున్నాయి. విరూప కారక బలాల్లో తన్యత, సంపీడన బలాలు భూపటలంపై పనిచేస్తాయి. భూపటలంలోని రాతిపొరల్లో చాలాకాలంగా ఉన్న బలాల వ్యత్యాసాల వల్ల కొన్ని ప్రదేశాల్లో భ్రంశాలు ఏర్పడి శిలాపొరల్లోని శక్తి వ్యత్యాసాలు సర్దుకుని ప్రతిబలం సడలి భూకంపం వస్తుంది. తర్వాత భూమి స్థిరత్వాన్ని పొందుతుంది. ఈ సిద్ధాంతం ప్రకారం పలకలు చలనంలో ఉండే భూప్రావారంపై కదులుతూ ఉష్ణసంవహన ప్రవాహాలుగా భావించే కొన్ని అనిర్ధారిత యంత్రాంగాల వల్ల ప్రభావితమవుతుంటాయి. ఈ పలకలు ఒకదానికొకటి తాకినప్పుడు భూపటంలో ఒత్తిడి కలుగుతుంది. ఈ ఒత్తిళ్లను పలకల హద్దుల వెంట జరిగే చలనాల ఆధారంగా వర్గీకరించవచ్చు.

ఎ) ఒకదానికొకటి దూరంగా జరగడం బి) ఒకదానికొకటి ఎదురెదురుగా నెట్టుకోవడం సి) ఒకదాని అంచుపై మరొక దాని అంచు జారడం.

పలకల హద్దుల వద్ద జారడం లేదా పగుళ్ల ద్వారా సంచితశక్తిని విడుదల చేసే ప్రతిబల ప్రాంతాలను 'భ్రంశాలు' అంటారు.

6) **స్థితిస్థాపకత సిద్ధాంతం:** దీని ప్రకారం విరూప కారక పలకల చలనం నిరంతరం భూపటలంపై ప్రతిబలం లేదా ఒత్తిడి కలగజేస్తూనే ఉంటుంది. అది యాదృచ్ఛికంగా గరిష్ఠ అవలంబన వికృత బిందువుకు చేరుతుంది. అప్పుడు భ్రంశం వెంట పగులు ఏర్పడి, వికృత బలం నుంచి విడుదలయ్యే వరకు శిల తన సొంత స్థితిస్థాపక బలాల కింద ఎగసిపడుతుంది. భ్రంశ పగుళ్లు ఉత్పత్తి చేసే కంపనాలను భూకంప తరంగాలు అంటారు. ఇవి భూకంప నాభి నుంచి అన్ని దిశలకు ప్రసరిస్తాయి.

భూ చలనాలు: భూకంపాల వల్ల వచ్చే భూచలనాలు పలురకాల విధ్వంసక ప్రభావాలను కలిగి ఉంటాయి. అందులో కొన్ని-

1) **భూ కదలిక:** నేల ద్వారా ప్రకంపన తరంగాలు ప్రయాణించడం వల్ల నేల ముందుకు, వెనుకకు చలిస్తుంది. 2) **మృత్తికా భంగాలు:** భూకదలిక వల్ల నేల ద్రవీకరించడంతో భూపాతాల్లాంటివి ఏర్పడతాయి. 3) **ఉపరితల భ్రంశ పగుళ్లు:** పగుళ్లు, నిలువు చీలికలు మొదలైనవి. 4) **వేలా తరంగాలు:** జలాశయ ఉపరితలంపై వచ్చే అతిపెద్ద తరంగాలు. ఇవి తీర ప్రాంతాల్లో భారీ నష్టం కలిగిస్తాయి.

భూకంప లక్షణాలు: భూకంపాలు సహజంగా సంభవిస్తాయి. ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఆకస్మికంగా ఎప్పుడైనా వస్తాయి. ★ వరదలు, చక్రవాతాలు, ఇతర ప్రధాన ఆకస్మిక విపత్తులకు దారితీసే వైపరీత్యాలకు హెచ్చరిక వ్యవధి ఉంటుంది. అందువల్ల వాటిని ఎదుర్కోవడానికి, ముందస్తు చర్యలు తీసుకోవడానికి, వాటి బారి నుంచి ప్రజలను రక్షించడానికి కొంతమేరకు అవకాశం ఉంటుంది. భూకంపాలు ముందుగా ఊహించడానికి లేదా నివారించడానికి అవకాశం లేదు. అయినప్పటికీ భూకంప విధ్వంసాన్ని తగ్గించవచ్చు. అత్యధిక శాతం విధ్వంసం భూకంపాల వల్ల కాకుండా కాంక్రీటు నిర్మాణాలు కూలడం వల్ల జరుగుతుంది. భూకంపాల వల్ల సంభవించే మరణాల్లో 95% భవనాలు కూలిపోవడం వల్లే జరుగుతున్నాయి. ★ భూకంప ప్రకంపనలు విభిన్న పౌనఃపున్యాలు, వేగాల్లో సంభవిస్తాయి. భూకంపం వాస్తవ పగుళ్ల ప్రక్రియ కొద్ది సెకన్లపాటే ఉంటుంది. భారీ భూకంపానికి అయితే ఒక నిమిషంపాటు ఉంటుంది. ★ అత్యధిక శాతం భూకంపాలు స్వల్ప కంపనాలే. అయితే భారీ భూకంపాలు స్వల్ప కంపనలతో మొదలై వేగంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విధ్వంసకర అఘాతాల రూపం దాల్చి, క్రమంగా తగ్గిపోయే ప్రకంపనలుగా ముగుస్తాయి. ★ వరదల్లాంటి కొన్ని సహజవైపరీత్యాలు భూగోళం మొత్తం విస్తరించి ఉన్నప్పటికీ, కొన్ని వైపరీత్యాలు నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలకు మాత్రమే పరిమితమవుతాయి. అలాంటి వాటికి భూకంపాలు ఉదాహరణగా చెప్పవచ్చు. భూకంపాలు సాధారణంగా భూపటలంలోని రెండు విభాగాలు కలిసే భౌగోళిక భ్రంశం వెంట సంభవిస్తాయి.

భూకంపాలు రకాలు:

నాభి లోతు ఆధారంగా భూకంపాలను మూడు రకాలుగా విభజించవచ్చు.

ఎ) గాథ భూకంపాలు: ఇవి ఉపరితలం నుంచి 0-60 కి.మీ. వరకు వ్యాపించి ఉంటాయి. ఈ తరహా భూకంపాలు తరచూ సంభవిస్తాయి. భూకంపనాభి భూఉపరితలానికి సమీపంలో ఉండటంతో తీవ్ర విధ్వంసం సృష్టిస్తాయి.

బి) మాధ్యమిక భూకంపాలు: ఇవి 60 కి.మీ. నుంచి 300 కి.మీ లోతు వరకు వ్యాపించి ఉంటాయి.

సి) అగాధ భూకంపాలు: ఇవి 300 కి.మీ. నుంచి 700 కి.మీ. లోతు వరకు వ్యాపించి ఉంటాయి.

ఉదాహరణకు సబ్‌డక్షన్ మండలాలు. 1933-34, 1943ల్లో ఇండొనేసియాలో అగాధ భూకంపాలు నమోదయ్యాయి. అగాధ నాభి భూకంప తరంగాలు భూఉపరితలానికి చేరేసరికి వాటి ప్రభావం తగ్గిపోతుంది. ఇవి చాలా అరుదుగా మాత్రమే విధ్వంసకరంగా మారతాయి.



రచయిత: ఇ. వేణుగోపాల్


కొత్తవలస-కొరాపుట్ మార్గంలో భద్రతా తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: వాల్తేర్ డివిజన్ కొత్తవలస-కొరాపుట్-రాయగడ మార్గంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా రెండు రోజులపాటు భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ మార్గంలో చేపట్టిన డబ్లింగ్ పనులు, రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు, అమృత్ భారత్ పనులను పరిశీలించారు. భద్రతపై గేట్‌మెన్లు, సిబ్బందికి ఉన్న అవగాహనను తెలుసుకుని పలు సూచనలు చేశారు.

ఆరోగ్యం.. కుటుంబం.. విధులకు ప్రాధాన్యం ఇవ్వండి సీపీ శంఖబ్రత బాగ్చీ



వెయిటింగ్ హాలును ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో పోలీసు మెన్స్ వెయిటింగ్‌హాలును నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శనివారం ప్రారంభించారు. ఈ హాలు పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని, సి.పి. కెమెరాల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ హాలును సిద్ధం చేయాలని ఆలోచన వచ్చిందన్నారు. సిబ్బందికి అవసరమైనప్పుడు సెలవులు ఇవ్వాలన్నారు. సెలవులు ఇవ్వని పక్షంలో తనకు తెలియజేయాలని కోరారు. ఆరోగ్యం, కుటుంబం, విధులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హాలు నిర్మాణంలో భాగమైన సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో డి.సి.పి.లు, ఏసీపీలు పాల్గొన్నారు.



సన్నాహక విన్యాసాల్లో పోలీసులు

అమరవీరుల సంస్మరణ సభకు సన్నాహాలు

పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు సంబంధించి పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అమరవీరుల సంస్మరణ సభలో భాగంగా పోలీసుమెస్ వద్ద ఉన్న స్తూపం వద్ద సన్నాహకాలు ప్రారంభించారు. నివాళులు అర్పించటం, కవాతు, పోలీసు బ్యాండ్ తదితర అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. –న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

మహిళను వేధిస్తున్న యువకుడి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: అసభ్యకర సందేశాలతో మహిళను వేధిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు ఎండాడ సైబర్‌క్రైం సీఐ బి.ఎం.డి.ప్రసాదరావు శనివారం తెలిపారు. నగరానికి చెందిన వివాహితకు కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కాల్స్ వస్తున్నాయి. ఈ క్రమంలో వారు అసభ్యకరంగా మాట్లాడటంతో సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేయడంతో పలు విషయాలు వెలుగు చూశాయి. నగరానికి చెందిన కోన యువరాజు (24) తప్పుడు ఇన్‌స్టాగ్రాం ఖాతా తెరిచాడు. తద్వారా 'ఒక్క రాత్రికి మూడు వేలు' అని బాధిత మహిళతో పాటు ఆమె భర్త చరవాణి నెంబర్లతో పోస్ట్ పెట్టాడు. దీంతో ఆయా నెంబర్లకు పలువురు కాల్ చేసి అసభ్యంగా మాట్లాడుతూ తీవ్రంగా వేధించారు. దీంతో వీరు పోలీసులను ఆశ్రయించారు. విచారణలో సంబంధిత వ్యవహారం మొత్తం బయట పడటంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జోరుగా భాజపా సభ్యత్వ నమోదు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : భాజపా క్రియాశీల సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో విశాఖ జిల్లా మొదటిస్థానంలో ఉందని, ఇప్పటి వరకు 1,50,300 మేర సభ్యత్వాలను పూర్తి చేశామని భాజపా జిల్లా అధ్యక్షులు రవీంద్ర అన్నారు. శనివారం భాజపా కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ నమోదుపై సమీక్ష జరిపారు. ఈ నెలాఖరు నాటికి రెండు లక్షల సభ్యత్వాలను చేయాలని పిలుపునిచ్చారు. మొదటి క్రియాశీలక సభ్యత్వాన్ని జిల్లా అధ్యక్షులు రవీంద్రకు అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధ లక్ష్మీనారాయణ, పార్వతీపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌ఛార్జి ఎన్.విజయానందరెడ్డి, భాజపా విశాఖ పార్లమెంట్ సంయోజక్ రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్‌యాదవ్, పి.శ్రీనివాసరావు, ఎన్.వి.ఎస్.దిలీప్ వర్మ, ధనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం తీసుకుంటున్న రవీంద్ర తదితరులు

'సంపత్ వినాయగర్' హుండీల ఆదాయం రూ.19.08 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 30 రోజులకుగాను రూ.19,08,894 నగదు, వెండి 132 గ్రాములు, యూఎస్‌ఏ డాలర్లు 21, సింగపూర్ డాలర్లు 10, యూఏఈ దిర్హమ్స్ 10, సౌదీ రియల్స్ 5, ఒమన్ రియల్స్ ఒకటి వచ్చాయి. శివజ్యోతి సేవా సంఘం ప్రతినిధులు హుండీల ఆదాయం లెక్కింపు చేపట్టగా, తనిఖీదారుగా ఎ.శ్రీధర్ వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు టీఆర్ చోళన్, దేవాదాయశాఖ ఏసీ కె.శిరీష, సిబ్బంది గోవిందరెడ్డి పాల్గొన్నారు

'విశాఖ డెయిరీ అక్రమాలపై విచారణ జరపాలి'



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరిపించాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం తెదేపా కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సొమ్మును డెయిరీ ఛైర్మన్ ఆడారి కుటుంబం దోచుకుందని, ప్రస్తుతం డెయిరీ తీవ్రమైన నష్టాల్లో నడుస్తోందన్నారు. చినగదిలి మండలం సర్వే సంఖ్య 13,21,26ల్లోని 7.96 ఎకరాల భూమిని ఆడారి కుటుంబం కబ్జా చేసిందని ఆరోపించారు. వైకాపా హయాంలో సిద్ధం సభలకు ఇక్కడి నుంచి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారన్నారు. మెరకముడిదాం మండలం గర్భం గ్రామంలో 50 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని, ఇళ్లు కట్టిస్తామని ఉద్యోగుల నుంచి రూ.86వేల చొప్పున వసూలు చేశారన్నారు. ఉద్యోగుల డబ్బుతో నరవ వద్ద 3 ఎకరాల భూమి కొనుగోలు చేశారని, అందులో 90 సెంట్లు ఆడారి కుటుంబ సభ్యుల పేర్లతో రాయించుకున్నారని ఆరోపించారు. ఆయా అక్రమాలపై దర్యాప్తు చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యా పర్యాటకంతో విజ్ఞానం, వినోదం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పర్యాటక రంగాన్ని అన్ని వర్గాలకు చేరువ చేయడానికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా మూడు విభాగాల్లో విద్యా పర్యాటకాన్ని ప్రారంభించామని, ఇది విద్యార్థులకు విజ్ఞానం, వినోదం పంచుతుందన్నారు. గాయత్రీ విద్యాపరిషత్, అగనంపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలెక్టరేట్ నుంచి బయలుదేరిన విద్యా పర్యాటక బస్సులకు కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. విద్యా పర్యాటకంలో భాగంగా వివిధ పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేశామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే వారికి రూ.10 కనీస రుసుముతో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మెరైన్ పర్యాటకంలో భాగంగా సాగర తీరంలోని సీ హారియర్, టీయూ 167, కురుసురా సబ్ మెరైన్, మారిటైమ్ మ్యూజియంలను, జీవ వైవిధ్య పర్యాటకంలో జూ, బయో డైవర్సిటీ పార్కు, కంబాలకొండ అభయారణ్యం, తీర పర్యావరణ పర్యాటకంలో భాగంగా ఏయూలోని జీవశాస్త్ర ప్రయోగశాలను సందర్శించవచ్చునన్నారు. జిల్లా పర్యాటకశాఖ అధికారిణి జ్ఞానవేణి, డీఈఓ చంద్రకళ, మారిటైమ్ బోర్డు అధికారి సుబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

తలనొప్పి, మూర్ఛ వ్యాధులపై చర్చాగోష్ఠులు



డాక్టర్ సతీష్‌చంద్రకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ గగన్‌దీప్ సింగ్, డాక్టర్ మెషరమ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సులో శనివారం పలు అంశాలపై నిపుణులు ప్రసంగించారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్లో జరుగుతున్న ఈ సదస్సు ఆదివారంతో ముగియనున్నది. శనివారం జరిగిన కార్యక్రమంలో యూజీ, పీజీ వైద్య విద్యార్థులు వివిధ అంశాలపై పోస్టర్లను ప్రదర్శించారు. తలనొప్పి నివారణ చర్యల్లో ఇటీవలి పురోగమనాలపై డాక్టర్ బండారు హారతి (అమెరికా) ప్రసంగించారు. పలువురు వైద్యులకు డాక్టర్ కామేశ్వరప్రసాద్, డాక్టర్ గౌరీదేవి అవార్డులు అందజేశారు. మూర్ఛ వ్యాధి ప్రస్తుత స్థితి, భవిష్యత్తు అనే అంశంపై డాక్టర్ ఇమాద్ ఎం.నజ్మ (అమెరికా) ప్రసంగించారు. మెదడు వ్యాధుల్లో 'ఎండోవాస్కులర్ ఎంబోలైజేషన్' అనే అంశంపై డాక్టర్ దల్జిత్ సింగ్ ప్రసంగించారు. సదస్సు నిర్వాహక కమిటీ ఛైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఎస్.గోపి, సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ సతీష్‌చంద్ర, డాక్టర్ గగన్‌దీప్‌సింగ్, డాక్టర్ మెషరమ్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి

సినిమాలు

విశాఖపట్నం(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– విశ్వం, చోటుమహరాజ్
(వెల్లంకి) – వేట్టయాన్ ది హంటర్

టోల్‌గేటు వివాదంలో మరొకరు అరెస్టు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస - విజయనగరం రోడ్డులోని జోడ మెట్టపాలెం టోలుగేటు వద్ద ఇటీవల జరిగిన వివాదంలో మరొకరిని అరెస్టు చేశామని సీఐ సుధాకర్ తెలిపారు. దీంతో ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఈ వ్యవహారంలో ఆచీతూచిగా వ్యవహరిస్తూ అరెస్టులు చేస్తున్నారు. నిందితుల పేర్లను కూడా బయటికి వెల్లడించకుండా పోలీసులు జాగ్రత్తలు పడుతుండడం గమనార్హం.

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: తారకరామాకాలనీ(రుషికొండ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - స్థానికులు, రుషికొండ

సమాధానం: శునకాల నివారణకు చర్యలు తీసుకుంటాం. - కిశోర్, ఆరోగ్య అధికారి

సమస్య: ఐటీసెజ్(రుషికొండ) నుంచి మధురవాడ వెళ్లే దారిలో ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడు తోంది. - మిథున్, మధురవాడ

సమాధానం: సంబంధిత ప్రాంతంలో పిచ్చిమొక్కలు తొలగిస్తాం. - సింహాచలం, జోన్-2 కమిషనర్

సమస్య: లా కాలేజీ (ఎండాడ) కూడలిలో ఓ దుకాణం వద్ద రోడ్డుపై వాహనాలు నిలిపివేయడంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. - సత్యమూర్తి, స్థానికుడు

సమాధానం: ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. - కాంతారావు, ట్రాఫిక్ సీఐ

అడుగుకో గుంత.. తప్పని చింత

భీమునిపట్నం, న్యూస్‌టుడే

భీమిలి ప్రధాన రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడ గుంతలతో ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది. అటుగా వెళ్లాలంటే ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి పట్టణ నియోజకవర్గ కేంద్రంతో పాటు, మండల కేంద్రం కావడంతో ఇక్కడకు నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. అయితే అడుగుకో గుంత ఉండటంతో వాహనాలు మొరాయించడంతో పాటు ఒళ్లు హూనమవుతోందని ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలబారిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు.



భీమిలి పోలీసుస్టేషన్ మార్గంలో ఇలా...

వర్షాల వస్తే మరింత దారుణం..

వర్షాల కారణంగా రోడ్ల పరిస్థితి మరీ తీసికట్టుగా తయారైంది. దీనికి తోడు ప్రయివేటు నెట్‌వర్క్ కేబుళ్ల కోసం రోడ్ల పక్కన తవ్విన గోతులను సరిగా పూడ్చలేదు. అలాగే జీవీఎంసీ రహదారిని తవ్వేసి కొత్త పైపులైన్లను అమర్చిన తర్వాత సమతలంగా తీర్చిదిద్దకుండా వదిలేశారు. దీంతో వాన వస్తే ఎక్కడికక్కడ నీరు నిలిచి గొయ్యి ఏదో రోడ్డు ఏదో గుర్తించలేక వాహనదారులు సతమతమవుతున్నారు.

రాకపోకలకు అనువుగా ఉండేలా..

పాడైన చోట్ల రోడ్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలి. సహజంగా రహదారులు వేసిన అయిదేళ్ల తర్వాత గండ్లు ఏర్పడే అవకాశం ఉండటంతో మళ్లీ వీటిమీద కొత్తగా రోడ్డు వేయాల్సి ఉంటుంది. అయితే వీటిని నిర్మించే సమయంలో తక్కువ మందంతో నాసిరకంగా నిర్మిస్తున్నారు. ఫలితంగా స్వల్ప కాలంలోనే ధ్వంసమవుతున్నాయి. రోడ్లను పటిష్టంగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నా సంబంధిత అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా చేతులు దులిపేసుకుంటున్నారు. గండ్లు ఏర్పడి అధ్వానంగా మారిన భీమిలి రహదారులను కాయకల్ప చికిత్స చేయకపోయినప్పటికీ కనీసం వీటిని పూడ్చి వాహనాల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



భీమిలి కుమ్మరిపాలెం వద్ద...



భీమిలి బ్యాంక్‌కాలనీ రహదారిలో గుంత

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పద్మనాభం, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. రేవిడి, వెంకటాపురం, కోరాడ, బి.ఆర్.తాళ్లవలస, అయినాడ గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న ఏడు పనులకు ప్రభుత్వం రూ.1.05 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా రేవిడి పంచాయతీ అన్నంపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. అందుకనుగుణంగా ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే పల్లె పండగ కార్యక్రమం పేరిట గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గత అయిదేళ్లలో ఎటువంటి అభివృద్ధి నోచుకోకపోవడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వంతో కొత్త వెలుగులు వచ్చాయన్నారు. అనంతరం వెంకటాపురం, కోరాడ, బి.ఆర్.తాళ్లవలస, అయినాడ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూటమి నాయకులు కె.దామోదరరావు, కె.రమణ, కె.నగేష్‌కుమార్, పాండ్రంగి అప్పలనాయుడు, ఆవాల గంగరాజు, తహసీల్దార్ కె.ఆనందరావు, ఎంపీడీవో బి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

రేపు ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

జేవీఅగ్రహారం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కానున్నారని తెదేపా మండల శాఖ అధ్యక్షుడు డీఏఎన్ రాజు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలపై ఆయన వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి స్వయంగా వినతులు తీసుకుంటారన్నారు. వైకాపా హయాంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలపై ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేసి న్యాయం పొందాలన్నారు.

ఘనంగా కార్తిక దామోదర మాసోత్సవాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ కేంద్రం(సాగర్‌నగర్)లో కార్తిక దామోదర మాసోత్సవాలు శనివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీ నితాయిసేవిని సమక్షంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథస్వామి విగ్రహాల్ని చూడచక్కని రీతిలో దీపాలతో అలంకరించిన తీరు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఉత్సవమూర్తుల మహిమల్ని వర్ణిస్తూ 'హరేరామ... హరే కృష్ణ నామస్మరణతో గీతాలాపనలు చేశారు.



దీపాలంకరణలో ఉత్సవమూర్తులు

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన శనివారం విజయనగరం నగరంలోని కాళీఘాట్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం జిల్లా ఆనందపురం ప్రాంతానికి చెందిన ఎన్.వెంకటరమణ (33) విద్యుత్తు పనుల నిమిత్తం ఒక ఇంటికి వచ్చారు. నిచ్చెన ఒకవైపు నుంచి మరో దగ్గరికి తీసుకొని వెళ్తుండగా 11 కేవీ విద్యుత్తు తీగలు తగిలి వెంకటరమణ అక్కడికక్కడే చనిపోయారు. అతని వెంట వచ్చిన బి.సూర్యారావు గాయపడ్డారు. మృతుని భార్య అమృత సుష్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్విగ్రశ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 నుంచి 1.30 వరకు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. వైద్యులు డా. జగన్నాథరావు, డా.మోహనరావు ఆధ్వర్యంలో పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

ఆశాజనకంగా ఖరీఫ్

అనకాపల్లి: ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. పరిశోధన కేంద్రం ఆవరణలో శనివారం ఉమ్మడి విశాఖ జిల్లాలోని వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో 11 శాతం అధికంగా వర్షం పడిందన్నారు. వరి సాగు లక్ష్యానికి మించి రైతులు వేశారన్నారు. అపరాలు 75 శాతం, చిరుధాన్యాలు 67 శాతం సాగు చేశారన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, శాస్త్రవేత్తలు రమణమూర్తి, శ్రీలత, విశాలాక్షి, శ్రీదేవి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో స్వామికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



గరుడ వాహనంపై పూజలందుకుంటున్న స్వామి వారు

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం శనివారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.



వధూవరుల అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా అమ్మవారి పూజలు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు గోశాల దరి ఆయిల్ మిల్ ప్రాంతంలో గణేశ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి దసరా ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉదయం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కోలాహలం నడుమ అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం వేడుకగా జరిగాయి.



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

వేములవలసలో అన్నసమారాధన

ఆనందపురం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వేములవలసలో శనివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ మేరకు వేములవలస ఉపసర్పంచి కోరాడ నవీన్‌జ్ఞానేశ్వర్ రూ.10 వేలు అందజేశారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోరాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న దృశ్యం

జిమ్నాస్టిక్స్‌లో ప్రతిభ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఆరో వార్డు రేవళ్లపాలెనికి చెందిన పిల్లా లక్ష్మీనారాయణ రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్‌లో ప్రతిభ చాటాడు. ఇటీవల విశాఖ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించి అర్హత సాధించాడు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జిమ్నాస్టిక్స్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఏపీ అంతర జిల్లాల ఛాంపియన్‌షిప్ (రాష్ట్ర స్థాయి)లో తృతీయ స్థానంలో నిలిచాడు. దీంతో లక్ష్మీనారాయణతో పాటు కోచ్ షేక్‌మున్వర్‌ను జిల్లా జిమ్నాస్టిక్స్ సంఘంతో పాటు పలువురు క్రీడాకారులు అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న లక్ష్మీనారాయణ

జోన్-2 ఏపీడీగా శ్రీరామ్

కొమ్మాది, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ పట్టణ సామాజికాభివృద్ధి (యూసీడీ) జోన్-2 ఏపీడీగా వై.వై.శ్రీరామ్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొలుత జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో జెడ్సీ పి.సింహాచలాన్ని కలిసి సంబంధిత ధ్రువపత్రాన్ని అందించారు. ఇక్కడ ఏపీడీగా విధులు చేపట్టిన గంగాధర్ గాజువాక జోన్‌కు బదిలీ కాగా.. జోన్-8 నుంచి శ్రీరామ్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీవోలు, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు ఆయనకు స్వాగతం పలికారు.



జెడ్సీ సింహాచలానికి ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఏపీడీ వైవై శ్రీరామ్

నేడు భీమిలిలో జిల్లా స్థాయి పోటీలు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షులు, విశ్రాంత ప్రిన్సిపల్ కాళ్ల సూర్య రామకృష్ణారావు తెలిపారు. భీమిలిలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం వేదికగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం, విజయాలు, వైఫల్యాలు, ప్రపంచ శాంతి, భద్రతా సమితి వైఫల్యాలు, తదితర అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రయివేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు వేదిక వద్దకు నిర్ణీత సమయానికి అరగంట ముందు చేరుకుని నేరుగా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 89856 47419 నంబరును సంప్రదించాలన్నారు.

వైజాగ్ బీట్స్ వార్షికోత్సవం నేడు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: వైజాగ్ బీట్స్ ఎనిమిదో వార్షికోత్సవాన్ని నగరంలోని అప్పుఘర్ వద్దనున్న గాదెరాజు ప్యాలెస్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఛైర్‌పర్సన్ డి.శారద భీమిలి బీచ్‌రోడ్డులో శనివారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గాయకుడు గజల్ శ్రీనివాస్, సినీ డైరెక్టరు పీసీ ఆదిత్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సంగీత, సేవా కార్యక్రమాలను నిర్వహించి పలువురిని సత్కరించనున్నట్లు వెల్లడించారు.

వైద్య సేవల్లో అలసత్వం వహించొద్దు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: యూపీహెచ్‌సీల్లో సమయపాలన పాటించి రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు సూచించారు. పీఎంపాలెంలోని యూపీహెచ్‌సీతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వేసే ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులతో స్వయంగా మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుని తెలుసుకున్నారు. ఓపీ సేవలు, రోగ నిర్ధారణ పరీక్షలు, మాతా శిశు ఆరోగ్యసేవలు తదితర దస్త్రాలను పరిశీలించారు. అర్హులైన వారికి సమయానుకూలంగా వ్యాక్సిన్‌లు వేయాలన్నారు. అలాగే బీసీజీ వ్యాక్సిన్ తదితరాలపై వైద్యులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంఓ బి.నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



పీఎంపాలెం యూపీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు

రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న ప్రచారం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: 'ఈ కారులో ప్రయాణించిన నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. సీటు బెల్టు ధరించండి.. అతి వేగం వద్దు.. మద్యం తాగి వాహనం నడపవద్దు..' అంటూ ఓ భారీ ప్రమాదానికి గురైన కారును ప్రదర్శిస్తూ రోడ్డు ప్రమాదాలపై వినూత్న ప్రచారం చేస్తూ ప్రజలు ఆలోచించేలా చేస్తున్నారు. నగర పోలీసుల సౌజన్యంతో మెడికవర్ ఆసుపత్రుల యాజమాన్యం రోడ్డు ప్రమాదాలపై సంచార ప్రచారం చేపట్టింది. ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయి.. ధ్వంసమైన కారును వ్యాన్‌లో ప్రదర్శిస్తూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం సింహగిరి రెండో ఘాట్‌రోడ్డు, పాత అడివివరం, పాత గోశాల కూడళ్లలో ఈ వాహనాన్ని ప్రదర్శించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



రహదారిపై ప్రదర్శనలో ఉంచిన కారు

విద్యుత్తు ఛార్జీలపై సీపీఎం నిరసన

మధురవాడ, న్యూస్‌టుడే: అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు తగ్గిస్తామని కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఎం మధురవాడ జోన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. విద్యుత్తు ఛార్జీల భారంపై శనివారం మధురవాడ ఏపీఈపీడీసీఎల్ జోన్-3 కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేసిన భారాన్ని తగ్గించాలని నినాదాలు చేశారు. పెరిగిన ఛార్జీల వల్ల చిన్నతరహా పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, వృత్తిదారులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, నాయకులు పి.రాజ్‌కుమార్, కె.నాగరాజు, ఎస్.పైడితల్లి, ఎ.గురుమూర్తిరెడ్డి, సీహెచ్.శేషుబాబు, డి.కొండమ్మ, బి.భారతి, పుష్ప, కె.పద్మ, ఆర్.జగదీష్, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సామాన్యులపై ధరల భారం తగ్గించాలి

మధురవాడ, న్యూస్‌టుడే: సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మధురవాడ మార్కెట్ వద్ద ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఇసుక కొరత కారణంగా అధిక శాతం మంది రోజువారీ కూలి పనులు లేక ఆర్థికంగా సతమతమవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు ఎం.ఎ.బేగం, కార్మిక మేస్త్రి బంగారయ్య, మహేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు, తదితరులు

శుభ్రత వహించకుంటే దుకాణాలు తొలగిస్తాం

మధురవాడ, న్యూస్‌టుడే: రోడ్ల పక్కన చిల్లర దుకాణాల వద్ద అపరిశుభ్రత తాండవిస్తే తగిన చర్యలు తీసుకుంటామని జోన్-2 కమిషనర్ పి.సింహాచలం అన్నారు. మధురవాడ మిధిలాపురి వుడా కాలనీలో శనివారం పర్యటించి రోడ్ల పక్కన చిల్లర దుకాణాలను తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం ప్లాస్టిక్ సంచులు వినియోగంపై స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా టిఫిన్ బండ్లు, తినుబండారాల దుకాణాల వద్ద అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలని లేదంటే దుకాణాలు తొలగిస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు రోడ్లకు మరమ్మతులు చేయాలని, కాలువలు నిర్మించాలని జెడ్సీని కోరారు. త్వరలో రూ.5 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వారికి వివరించారు. నిబంధనలు మీరి ప్లాస్టిక్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలని సహాయ వైద్యాధికారి కిశోర్‌కు ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది విధుల నిర్వహణ విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా చూడాలని శానిటరీ అధికారులకు సూచించారు. సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.




మిధిలాపురి వుడా కాలనీలో రోడ్డు పక్కనున్న చిల్లర దుకాణాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ సింహాచలం

ప్రయోగాత్మకంగా ఇన్‌ఫిల్ట్రరైజేషన్ క్లోరినేషన్

సంగివలస(తగరపువలస) న్యూస్‌టుడే: భీమిలి మండలం రాజుల తాళ్లవలస గ్రామంలో సురక్షితమైన తాగునీటిని అందించే చర్యల్లో భాగంగా ఇన్‌ఫిల్ట్రరైజేషన్ క్లోరినేషన్ ప్రక్రియను శనివారం ప్రయోగాత్మకంగానిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి కనకల రమేశ్‌నాయుడు లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటివరకూ బ్లీచింగు పౌడరును ట్యాంకుల్లో జల్లి నీటిని శుద్ధి చేసే ప్రక్రియకు ప్రత్యామ్నాయంగా ఇది ఉంటుందన్నారు. మోటారు ద్వారా భూమిలో నుంచి వచ్చే నీరు ట్యాంకుకి చేరే క్రమంలో బ్లీచింగు మాత్ర (టాబ్లెట్) ద్వారా శుద్ధి అవుతుందన్నారు. దీన్ని ముందుగా తాళ్లవలసలో ప్రయోగాత్మకంగా చేపట్టామన్నారు. ఇది విజయవంతమైతే మిగిలిన పంచాయతీలకు వర్తింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కీర్తి ప్రసాద్, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు డీఏఎన్ రాజు, ఎంపీటీసీ సభ్యులు కోరాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

కారుషెడ్డు కూడలిలో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లే

పీఎంపాలెం, న్యూస్‌టుడే: జాతీయరహదారిపై కారుషెడ్డు, క్రికెట్ స్టేడియం కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం కూడళ్లతో పాటు ఆయా సేవా మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కూడళ్లకు అనుసంధానంగా ఉండే ప్రధాన రహదారులు, సేవా మార్గాల్లో దుకాణాల ముందు వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేయడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించి సమయానుభవం లేకుండా భారీ వాహనాలను సేవా మార్గాల్లోకి అనుమతించడం, దుకాణాల ముందు అనధికారిక పార్కింగ్‌పై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం తదితర కారణాల దృష్ట్యా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కారుషెడ్డు కూడలి నుంచి పీఎంపాలెం రహదారిలో భారీగా నిలిచిన వాహనాలు

'జగన్' చిత్రం తొలగింపు

స్పందనకు వందన

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఎనిమిదో వార్డు పరిధి పెదరుషికొండ సచివాలయం బోర్డుపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ చిత్రాన్ని జీవీఎంసీ అధికారులు తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ఇప్పటికీ జగన్ చిత్రమే దర్శనమిస్తున్న విషయాన్ని సంబంధిత సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానిక తెదేపా నేతలు పేర్కొన్నారు. దీంతో 'ఈనాడు'లో 'ఇదేమి చిత్రమో' శీర్షికతో కథనం ప్రచురించగా స్పందించిన అధికారులు ఆ చిత్రాన్ని తొలగించారు.



సచివాలయం బోర్డుపై జగన్ చిత్రాన్ని తొలగించిన దృశ్యం

బీచ్ రోడ్డు కోత నివారణకు కృషి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బోయివీధి వద్ద బీచ్ రోడ్డు కోతకు గురవకుండా పటిష్టమైన రక్షణ గోడను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. భీమిలి జోన్‌లో శనివారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గొల్లలపాలెం ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. దీన్ని పీపీపీ విధానంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే భీమిలి పట్టణ నడిబొడ్డునున్న చారిత్రక గంట స్తంభాన్ని ఆకర్షణీయంగా ఆధునికీకరిస్తామన్నారు. అలాగే భీమిలిలో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాన్ని త్వరలోనే పూర్తిచేసి పై అంతస్తులో కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. భీమిలిలోని మినీ స్టేడియం వద్ద వర్షాల సమయంలో రోడ్డు మీద నీరు నిలిచిపోవడంతో ఇక్కడ పూర్తిస్థాయిలో కాలువల నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీనివాసప్రసాద్, విజయదుర్గ, జెడ్సీ పి.ప్రేమప్రసన్నవాణి, ఏసీపీ ఎం.తిరుపతిరావు, రెండో వార్డు కార్పొరేటర్ జి.చిన్నికుమారి లక్ష్మి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు.



భీమిలి జోన్ కుమ్మరిపాలెం ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ డా.పి.సంపత్‌కుమార్

విశాఖ తూర్పు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై సదస్సు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రము విభాగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ప్రియదర్శిని విద్యా సంస్థల అధ్యక్షులు డాక్టర్ అలుగు ఆనంద్ శేఖర్ ముఖ్యవక్తగా విచ్చేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డాక్టర్ వీర్రాజు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రియాంక, విజయ్, రమేష్, శ్రీకాంత్, అభిషేక్, ప్రేమ్ కుమార్, పవిత్ర, సాయి చంద్, రాజ్‌కుమార్, దుర్గాదేవి పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

■ లోకేశ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జీవో 117 రద్దుతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. హేతుబద్ధీకరణ, విలీనం పేరుతో ఐదేళ్ల జగన్ పాఠశాల విద్యను భ్రష్టుపట్టించారని విమర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక విద్య నిర్వీర్యానికి వైకాపా ప్రభుత్వం జీవో 117ను తీసుకువచ్చిందన్నారు. జగన్ తెచ్చిన ఈ చెత్త జీవోను రద్దు చేసి పాఠశాల విద్యకు ఊపిరిలూదారన్నారు.

■ పాటకోసం బతికిన గద్దర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : గద్దర్ పాటకోసమే జీవించారని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఆయన ఛాంబర్‌లో 'గద్దర్ అన్న యాదిలో' కార్యక్రమ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ గద్దర్ పాట, సాహిత్యం సామాన్యుల గుండెల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ప్రజాగాయకులు మజ్జి దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

■ ఘర్షణలో పలువురికి గాయాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు బీఎన్ఆర్.నగర్‌లో కుటుంబ తగాదా చినికి చినికి గాలివానగా మారి గాయాల వరకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించిన ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తోటగరువు పాఠశాల సమీపంలోని బీఎన్ఆర్.నగర్‌లో తోటి కోడళ్ల మధ్య తగాదాలు ఉన్నాయి. శనివారం వీరి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణ దాడుల వరకు వెళ్లింది. ఈ సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని విమ్స్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

■ ముగిసిన న్యాక్ కమిటీ సభ్యుల సందర్శన

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ కమిటీ సభ్యుల సందర్శన శనివారం సాయంత్రంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ విజయబాబు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న పలు విభాగాలను, భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం కళాశాల ఎ.గ్రేడ్‌లో ఉంది. కమిటీ సభ్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా కళాశాలకు ఎటువంటి గ్రేడ్ వస్తుందో వేచిచూడాల్సిందే.

■ జిరాక్సు యంత్రం వితరణ

హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శనివారం లయన్స్‌క్లబ్ విశాఖపట్నం వారిచే రూ. 75వేల విలువచేసే జిరాక్సు యంత్రం వితరణ చేశారు. శనివారం ఈ పరికరాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, సుధాకరరావు, ప్రసాదరాజు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు కృష్ణారావు, ఆర్వీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

■ పూర్వ నైపుణ్యాభివృద్ధి కేంద్రం పరిశీలన

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవలో ఖాళీ చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం భవనాన్ని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ శనివారం పరిశీలించారు. భవనంలో అన్ని విభాగాల్లో వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయాలన్నారు. భవనం విస్తీర్ణం, భవనంలో నిర్మాణాలు, ఖాళీ స్థలం వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజును ఆదేశించారు. రాత్రి సమయంలో భద్రత ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు సూచించారు. ఆయన వెంట పర్యవేక్షక ఇంజినీరు శాంసన్‌రాజు, డీడీహెచ్ దామోదరరావు, ఉపకార్యనిర్వాహక ఇంజినీరు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



ముడసర్లోవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పి.సంపత్ కుమార్

పట్టించుకుంటే పర్యావరణహితమే..



నేతాజీనగర్ ప్రాంతంలో మొక్కలతో ఆహ్లాదంగా..

ఆరిలోవ, న్యూస్‌టుడే

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపొందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. వాటి రక్షణకు కొందరికి బాధ్యత అప్పగించారు. ఇది కొన్నాళ్ల క్రితం సంగతి. అయితే పట్టించుకున్న చోట పచ్చదనం బాగుంది. కానీ వదిలేసిన చోట మాత్రం పచ్చదనం జాడేలేదు.

బీఆర్టీఎస్ గ్రీన్‌బెల్ట్ పరిస్థితి ఇది.

హనుమంతువాక నుంచి దీనదయాళ్‌పురం వరకు బీఆర్టీఎస్ రోడ్డుకు సర్వీసు రోడ్డుకు మధ్యన సుమారు 10 మీటర్ల వెడల్పున ఉన్న ఖాళీ స్థలంలో జీవీఎంసీ మొక్కలు పెంచుతోంది. ఈ గ్రీన్‌బెల్ట్ మధ్యలో ఆరు ఆలయాలు ఉన్నాయి. ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్న చెట్లను, మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత ఆయా ఆలయ కమిటీలకు అప్పగించారు. అయితే కొన్ని ఆలయ కమిటీలు ఆయా ఆలయాల పక్కన ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను పరిరక్షిస్తున్నాయి. చుట్టూ ఫెన్సింగ్ వేసి పశువులు రాకుండా మొక్కలను కాపాడుతున్నారు. నేతాజీనగర్ దీనదయాళ్‌పురం ప్రాంతాల్లో మొక్కలకు రక్షణ కల్పిస్తున్నారు. సాలిపేట, చినగదిలి ప్రాంతాల్లో సంరక్షణ లేకపోవడంతో ఆ ప్రాంతంలో మొక్కలు పోయి ఖాళీ జాగాలు మిగిలాయి.

సంరక్షించమని చెప్తున్నాం..

గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న మొక్కలను పరిరక్షించాలని ఆయా ఆలయ కమిటీలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా మొక్కలను నరికినా, పాడుచేసినా వారిపై పోలీసు కేసు పెడతాం.

– ఎం.దామోదరరావు, డిప్యూటీ డైరెక్టర్, హార్టికల్చర్, జీవీఎంసీ



చినగదిలి ప్రాంతంలో కనిపించని మొక్కలు

దుర్గామాతను దర్శించుకున్న హిందుపురం ఎం.పి.

ఆరిలోవ, న్యూస్‌టుడే: హిందూపురం పార్లమెంటు సభ్యులు బి.కె.పార్థసారధి 12వ వార్డు పరిధి పెదగదిలిలో దుర్గాదేవి అమ్మవారిని శనివారం దర్శించుకున్నారు. ఆయనకు నిర్వాహకులు దూళి రఘు అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం అమ్మవారి అనుపు ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న పార్థసారథి

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-6 61/ఎ/8 పోల్‌పై వీధి దీపాలు వెలగటంలేదు.
– హనుమంతురావు

సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కొత్త దీపాలను అమరుస్తాం.
– విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

వ్యభిచారగృహంపై దాడి

ఎం.వి.పి.కాలనీ: గాజువాక బీసీ రోడ్డులో ఒక ఇంట్లో వ్యభిచారగృహం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఆ సమయంలో నిర్వాహకుడు, విటుడితో పాటు ఇద్దరు బాధిత మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పెందుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

దివ్యాంగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా..

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీలోని మానసిక దివ్యాంగుల పాఠశాల, అంధుల పాఠశాల హెలెన్‌కెల్లర్ సంస్థలను జిల్లా న్యాయ సేవల సాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ సందర్శించారు. శనివారం ఎంవీపీకాలనీ సెక్టారు-9లోని సంస్థల కార్యాలయాలకు వెళ్లి అక్కడ ఉంటున్న దివ్యాంగులతో ముచ్చటించారు. వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. హెలెన్ కెల్లర్‌లో వసతి సదుపాయాలను పరిశీలించారు. అంధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లెబెన్స్‌హిల్ఫే డైరెక్టర్ లక్ష్మీ సూర్యశ్రీ, హెలెన్ కెల్లర్ కరస్పాండెంట్ ఈ.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



లెబెన్స్‌హిల్ఫేలో తరగతి గదులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి శేషమ్మ

అతిథి ఉపన్యాసం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్(సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం జరిగింది. 'సామాజిక చేరిక విభిన్నమైన పరిస్థితి, ఈశాన్య భారతం నుంచి ప్రతిబింబాలు' అనే అంశంపై ఈ ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మతాలు, సంస్కృతులు, జాతులకు నిలయమైన భారతదేశం విభిన్నమైన దృశ్యాలను అందజేస్తోందన్నారు. సిక్కిం విశ్వవిద్యాలయం ఆంత్రోపాలజీ విభాగం అధిపతి ఆచార్య కె.ఆర్.రామమోహన్ ప్రధాన ఉపన్యాసం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్ ఆర్.మనోజ్‌కుమార్, డాక్టర్ జె.శ్రీ విరజారాణి, డాక్టర్ బి.శివరామకృష్ణ, డాక్టర్ జి.శాంతారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు, విజేతలుగా నిలిచిన డి.తేజశ్రీ, కె.లావణ్య, ఎం.ఎం.ప్రసన్న కుమార్‌లకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి..

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ, దుర్గామ్మ ఆలయం దగ్గర ఉన్న శ్రీ అంజనా పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. డి.తేజశ్రీ (8వ తరగతి), కె.లావణ్య (10వ తరగతి), ఎం.ఎం.ప్రసన్న కుమార్(8వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయులు ఎన్.గణేష్, ఉపాధ్యాయులు ఎస్.హరిక, ఎస్.సతీష్, ఎన్.హనుమంతురావుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

ఈస్టు ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన సి.పి.

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని తూర్పు ఏసీపీ కార్యాలయాన్ని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శుక్రవారం రాత్రి సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈస్టు ఏసీపీ కార్యాలయం సబ్‌డివిజన్ అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించారు. సబ్ డివిజన్ పరిధిలో ఉన్న కేసుల రికార్డులు సక్రమంగా ఉన్నది లేనిది పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేసుల పెండింగ్ వివరాలను తెలుసుకున్నారు. చట్టపరంగా కేసులు పరిష్కరించాలని ఆదేశించారు. ఏసీపీ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.



ఏసీపీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

టమోటా, ఉల్లి విక్రయాల పరిశీలన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీ రైతుబజారులో ఉల్లి, టమోటా విక్రయాలను మార్కెటింగ్ శాఖ అధికారులు పరిశీలించారు. శనివారం ఉదయం మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ సుధాకర్, ఏ.డి. యాసిన్, ఇంజినీరింగ్ అధికారి శెట్టిబాబు రైతుబజారును సందర్శించారు. కర్నూలు నుంచి వచ్చిన ఉల్లిపాయల స్టాకును తనిఖీ చేశారు. ఉల్లి నాణ్యతను వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి విక్రయిస్తున్న వంట నూనెల వివరాలను పరిశీలించారు. టమోటా, ఉల్లి నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ఎస్టేట్ అధికారి ప్రసాద్, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతుబజారులో ఉల్లి విక్రయాలను తెలుసుకుంటున్న ఆర్జేడీ సుధాకర్ తదితరులు

మత్స్యశాఖ పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : వాసవానిపాలెంలోని మత్స్యశాఖ చెందిన ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ భక్తిశ్రద్ధలతో జరిపారు. విగ్రహదాత పి.సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సత్యవేణి, పాఠశాల ఛైర్మన్ పేర్ల భాస్కరరావు, బాబా బజార్ అధినేత రవికుమార్ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థుల దినచర్యలో యోగా భాగం కావాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : విద్యార్థుల దినచర్యలో యోగా ఒక భాగం కావాలని భారత ఇంధన, శక్తి సంస్థ (ఐఐపీఈ) రిజిస్ట్రార్ ఆచార్య రాంపాల్ ద్వివేది అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా విలేజ్‌లో 'ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0'లో భాగంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో యోగా గురువు ఆచార్య తులసీరావు, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు డాక్టర్ ఆర్.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఐఐపీఈ రిజిస్ట్రార్ ఆచార్య రాంపాల్ ద్వివేది, తదితరులు

కనీస వేతనం వర్తింపచేయాలి

ఎం.వి.పి.కాలనీ, ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : రాష్ట్రవ్యాప్తంగా 123 స్థానిక సంస్థల్లో పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంటీఎస్ (మినిమమ్ టైం స్కేల్) వర్తింపచేయాలని నవ్యాంధ్ర డేటా ఎంట్రీ ఆపరేటర్ల అసోసియేషన్ సభ్యులు తెదేపా జాతీయ కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు రామ్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన నారా లోకేశ్ ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. జీవీఎంసీ నుంచి పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు

మరింత ప్రమాదకరంగా...



ప్రమాదకరంగా మారిన ప్రహరీ కింది భాగం

పర్యాటక ప్రాంతం ప్రమాదకరంగా మారింది. తెన్నేటిపార్కు నుంచి రోప్‌వే వైపు వస్తున్న సందర్శకులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన ప్రహరీ కింద భాగం ఇటీవల కురిసిన వర్షాలకు జారిపోయింది. దీంతో ప్రహరి వద్ద దెబ్బతింది. ఇక్కడ సాయంత్ర సమయంలో ఎక్కువ మంది సందర్శకులు వచ్చి సేదతీరుతుంటారు. సముద్రం వైపు చూస్తూ గడుపుతుంటారు. వర్షాలకు చెరియలు నానటంతో కిందకు జారిపడ్డాయి. దీంతో ప్రహరీ ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా యంత్రాంగం పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



సముద్రం వైపు జారిపడిన రాళ్లు



ప్రహరీ దెబ్బతినటంతో నడకదారిలో ఏర్పడిన పగుళ్లు

జాతుల పరిరక్షణపై జాతీయ కార్యశాల

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తూర్పు కనుమలలో స్థానిక జాతుల పరిరక్షణపై రెండు రోజుల జాతీయ కార్యశాల నిర్వహించనున్నారు. ఈ కార్యశాల పోస్టర్‌ను శనివారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 27, 28 తేదీల్లో ఈ కార్యశాల నిర్వహిస్తారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యాదీపిక, ఆచార్య పి.కె.రత్నకుమారి, ఆచార్య బి.సుజాత, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు, తదితరులు

విద్యార్థులకు పోటీలు

శివాజీపాలెం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి) ఆధ్వర్యంలో కళాభారతిలో కందుకూరి వీరేశలింగం పంతుల జీవిత చరిత్రపై పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 22 మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు జీఆర్కేప్రసాద్ తెలిపారు. ఈనెల 24న తుది పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాభారతి నిర్వాహకులు ఎం.ఎస్.ఎన్.రాజు, ఫైడా కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులతో కళాభారతి నిర్వాహకులు

వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఉషోదయ కూడలిలోని ఉషోదయ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వస్త్ర ప్రదర్శనకు సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చింది. విజయవాడ, కాకినాడ, విజయనగరం, రాజమహేంద్రవరం, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు వస్త్రాలను ప్రదర్శించారు. చీరలు, డ్రెస్ మెటీరియల్స్, చుడీదారులు, నార సంచులు, పిల్లల దుస్తులు, బెడ్‌షీట్లు, గలేబులు, ఫ్యాషన్‌జాకెట్లు ప్రదర్శనలో అమ్మకానికి ఉంచారు. ఆదివారంతో ఈ ప్రదర్శన ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. దయాల్బాగ్ కేంద్రం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు.



వస్త్రాలను కొనుగోలు చేసేందుకు వచ్చిన సందర్శకులు

ఎయిడెడ్ అధ్యాపకులను తక్షణం పంపించండి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులను తక్షణం వర్సిటీ నుంచి పంపించాలని ఏయూ జేఏసీ రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కోరింది. ఈ మేరకు నగరానికి వచ్చిన ఆయనను కలుసుకొని వినతిపత్రం అందించారు. మంత్రి స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఏయూ జేఏసీ సభ్యులు పర్మినెంట్ ఆచార్యులు, కాంట్రాక్ట్ ఆచార్యులు, గెస్ట్ ఫ్యాకల్టీ, పరిశోధకులు ఉన్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏయూ ఆచార్యులు

క్రీడాకారులకు ఏయూ ప్రోత్సాహం: రిజిస్ట్రార్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎప్పుడూ సహకారం అందిస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానంలో గల బాస్కెట్ బాల్ కోర్టులో ఏయూ ఇంటర్ కాలేజీయెట్ బాస్కెట్‌బాల్ పురుషుల పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడల విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, విభాగ ఆచార్యులు ఆచార్య ఎ.పల్లవి, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు

రెల్లివీధిలో మహాఅన్నదానం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : చినవాల్తేరు రెల్లివీధిలో విజయదుర్గా అమ్మవారి మారోత్సవాల సందర్భంగా శనివారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కె.అచ్యుతరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం అన్నప్రసాదం భక్తులకు వడ్డించారు. భాజపా నాయకులు మహ్మద్ గౌస్, విజయదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షులు చెన్నా తిరుమలరావు, నీలాపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులు అవసరం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం (ఏఈఆర్‌సీ) భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలసి 'వాతావరణ మార్పులు, భారతీయ వ్యవసాయం, సుస్థిర పద్ధతులు' అన్న అంశంపై శనివారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయా రంగాల నిపుణులు, పరిశోధకులు, పండితులు పాల్గొని వాతావరణ మార్పులు, భారతీయ వ్యవసాయంపై దాని ప్రభావంపై చర్చించారు. కార్యక్రమానికి ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాతావరణ మార్పుల కారణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవసరాన్ని ఆయన వివరించారు. ఏఈఆర్‌సీ మాజీ డైరెక్టర్ డాక్టర్ టి.వి.ఎస్.రావు వ్యవసాయంలో వాతావరణ మార్పులతో కూడిన సవాళ్లను, అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్.పి.సీ.ఎస్.ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జి.మోహనరావు, ఆచార్య సాంబమూర్తి, డాక్టర్ కె.ఆదిశేషు, డాక్టర్ కె.వి.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య ఎ.నరసింహారావు

భారీ అన్నసమారాధన

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అభయ దుర్గాదేవి, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సూపర్ గ్యాస్ ఏజెన్సీ అధినేత కోన గోవింద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సుమారు రెండు వేల మందికి పైగా అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కోన గోవింద్, సంఘం సభ్యులు

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

కొత్త దీపంతో వెలుగులు

మురళీనగర్, న్యూస్‌టుడే : జాతీయ రహదారి గంగా గోదావరి వుడా బహుళ అంతస్థుల సముదాయం సమీపంలో గత రెండు నెలలుగా వీధిదీపం వెలగక స్థానికులు అవస్థలు పడుతున్నారన్న విషయాన్ని శనివారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. కొత్త బల్బు వేసి వెలుగులు అందేలా చర్యలు తీసుకోవడం పట్ల నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.



రంధ్రం పూడ్చారు



స్పందనకు వందనం

గురుద్వారా, న్యూస్‌టుడే: టీపీటీ కాలనీ దరి లడ్డూ గోపాల్ మిఠాయి దుకాణం పక్క మార్గంలో ఏర్పడిన రంధ్రం సమస్య ఎట్టకేలకు తీరింది. 'ఈనాడు'లో ఇటీవల ప్రచురితమైన వార్తపై జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. కాలువపై కొత్త సిమ్మెంటు పలక అమర్చారు. దీంతో అటుగా రాకపోకలు సాఫీగా జరుగుతాయని స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత

కనుమరుగవుతున్న నడకదారులు

ఫోకస్

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే

నగరంలో ప్రధాన రహదారులపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు పలు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. అన్ని ప్రధాన రహదారుల్లోనూ ఇదే పరిస్థితి. వాణిజ్యపరంగా నిత్యం రద్దీగా ఉండే రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, డైమండ్ పార్కు, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ దారుణం. ప్రధాన ప్రాంతాల్లో షాపింగ్‌కు వచ్చే వ్యక్తులు రోడ్ల మీదే వాహనాలను పార్కింగ్ చేసి, వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో సాయంత్రం వేళల్లో ఇక్కడ ట్రాఫిక్ కిటకిటలాడుతోంది. ప్రస్తుతం రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం వంటి కొన్ని ప్రాంతాల్లో కల్వర్టులు, డివైడర్ల మరమ్మతు పనులు చేస్తుండడంతో రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరీ జఠిలంగా మారింది. తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, కంచరపాలెం వంటి ప్రాంతాల్లో రహదారులపై ఎక్కడా ఫుట్‌పాత్‌లన్నవే కనిపించవు. పాదచారులు సైతం రోడ్డుమీదే నడవాల్సిన పరిస్థితి. రైల్వేన్యూకాలనీలో అయితే వందలాది ద్విచక్ర వాహనాలను రోడ్డుమీదే పార్కింగ్ చేస్తున్నారు. దొండపర్తి, డైమండ్ పార్కు వద్ద ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రోడ్ల మీదే కార్లు, గూడ్సు ఆటోరిక్షాలు ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. తాటిచెట్లపాలెం ఎనబై అడుగుల రోడ్డులో ఓ ప్రయివేట్ ట్రావెల్స్ వాహనాలన్నీ రోడ్డు మీదే ఉంటాయి.



తాటిచెట్లపాలెంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారి



రైల్వేన్యూకాలనీలో ఫుట్‌పాత్ మీద వాహనాలు



కంచరపాలెంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన దుకాణదారులు

భారీ వాహనాలు సైతం..

ఉత్తర నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో రహదారులపై భారీ వాహనాలను సైతం ఇష్టానుసారంగా నిలిపేస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య ఎక్కువగా తాటిచెట్లపాలెం ఎనబై అడుగుల రోడ్డు, బి.ఎస్.ఎన్.ఎల్.కాలనీలో కనిపిస్తోంది. ప్రయివేట్ ట్రాన్స్‌పోర్టు యజమానులు ఇష్టానుసారంగా లారీలు, టిప్పర్లు, ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేసి రోజుల తరబడి వదిలేస్తున్నారు. మరమ్మతులు పనులు సైతం ఇక్కడ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు.

జనసేనలోకి పలువురి చేరిక

సీతంపేట, న్యూస్‌టుడే : జనసేన పార్టీలోకి శనివారం పలువురు చేరారు. విశాఖ దక్షిణ నియోజక వర్గ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ వారిని కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మహిళ కళాశాల ఎదురుగా గల నైట్ ఫుడ్ కోర్టు అధ్యక్షులు పోలవరపు సంసింగ్ ఆధ్వర్యంలో ఫుడ్ కోర్టులో పనిచేస్తున్న కె.సాయికుమార్, అరసాడ లక్ష్మి, ఎ.భారతి, చిన్న, వంశీ, రమేష్, రమణమ్మ, సత్యవతి, భవాని, చిన్నమ్మలు, నాయుడు, మురళి, సురేష్ తదితరులు సుమారు 150మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో శివ ప్రసాదరెడ్డి, 27వ వార్డు జనసేన అధ్యక్షులు సురేష్ బాబు, 34వ వార్డు ఇంచార్జి నారా నాగేశ్వరరావు, 35వ వార్డు ఇంచార్జి శ్రీనివాస్, 42వ వార్డు ఇంచార్జి మర్రి వేముల శ్రీనివాస్, భయన సునీల్, తేజ, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఘనంగా గ్యారీ ఉత్సవాలు

మాధవధార, న్యూస్‌టుడే: 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో గ్యారీ షరీఫ్ ఉత్సవాల్ని భాగంగా శనివారం మసీద్-ఈ-అల్‌ఖాదీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కాలనీలో ఉన్న హజరత్ గౌస్ నిషాని వద్ద పాతిహా నిర్వహించారు. కాలనీలో ఉన్న చిన్నారులచే నాతే కలం ఆలపించి, వివిధ పాటల, ఆటల పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం రాత్రి కాలనీలో అన్న దావత్ చేశారు. కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.



నాతే కలం ఆలపిస్తున్న ముస్లిం చిన్నారులు

నూతన కార్యవర్గ ఎన్నికకు సన్నాహం

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-8 వాకర్స్‌క్లబ్ సభా వేదికపై శనివారం సాయంత్రం పల్లా చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ ఏడాది క్లబ్ తరపున చేపట్టిన సేవా కార్యక్రమాలు, ఆర్థిక పురోగతి, అభివృద్ధిపై సమీక్షించారు. నూతన కార్యవర్గ ఎన్నికను త్వరలో నిర్వహించేందుకు నిబంధనావళిని సర్వసభ్య సమావేశం ఆమోదం కోసం సిఫార్సు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సి. హెచ్. ప్రసాదరావు, ఎన్. బుచ్చయ్య, ఆర్. సత్యనాథం, కె. ద్వారకానాథ్, మల్ల రామకృష్ణ, జి. విజయలక్ష్మి, ఎన్. ప్రకాశరావు, వడ్డాది అప్పారావు, ఎస్. రామ్మోహన్‌రావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షులు పల్లా చంద్రమౌళి

30న జోన్-3 దుకాణాల వేలం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ జోన్-3 పరిధిలోని వాణిజ్య సముదాయాలకు 30న వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి జోనల్ కార్యాలయంలో వేలం ఉంటుందని, ఇతర వివరాలకు కార్యాలయ పర్యవేక్షకుడ్ని సంప్రదించాలని కోరారు.

తాత్కాలిక ప్రాతిపదికన సాగరమిత్ర పోస్టుల భర్తీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: సాగరమిత్ర పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రెండు పోస్టులు భర్తీ చేస్తామని, నెలకు రూ.10వేలు వేతనంగా ఇస్తామని, పనితీరు బాగుంటే మరో రూ.5వేలు ప్రోత్సాహకం రూపంలో చెల్లిస్తామన్నారు. ఫిషరీస్‌లో పాలిటెక్నిక్ డిప్లమో లేదా బీఎస్సీ ఫిషరీస్ సైన్స్, మెరైన్ బయాలజీ, జువాలజీ డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 31వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులను చేపలరేవులోని మత్స్యశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

బదిలీ అయిన అధికారుల రిలీవ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఇంజినీరింగ్ అధికారులంతా రిలీవ్ అయ్యారు. ఇక్కడ్నుంచి బదిలీ చేసినవారి స్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో ఒక కార్యనిర్వాహక ఇంజినీరు, ఇద్దరు ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, నలుగురు సహాయ ఇంజినీర్లను కమిషనర్ రిలీవ్ చెయ్యలేదు. అయితే బదిలీ అయిన వారంతా వెళ్లి పోవాల్సిందేనని మున్సిపల్‌శాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో శనివారం ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ నుంచి రిలీవ్ చేశారు.

సంతోషానికి స్వచ్ఛమైన ఆహారం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు అన్ని అంశాలలోనూ పోటీపడాలని పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ సూచించారు. శనివారం ప్రపంచ చెఫ్ దినోత్సవాన్ని రోటరీ క్లబ్ కపుల్స్ యూత్ సర్వీసెస్, సన్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్ ప్రధాన రహదారిలో నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులకు 'స్వచ్ఛమైన ఆహారం-సంతోషకరమైన సందర్భం' అంశంపై పోటీలు నిర్వహించారు. వైజాగ్ కపుల్స్ కార్యదర్శి శ్రావణి, యూత్ సర్వీసెస్ డైరెక్టరు కరుణ, ప్రతినిధులు జయ, జ్యోతి, డాలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పైడా కృష్ణప్రసాద్

విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని నిరసన

మాధవధార, న్యూస్‌టుడే: విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలంటూ సీపీఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎన్ఎస్‌టీఎల్ సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. 2021-2022కు సంబంధించి వాడిన కరెంటు, చెల్లించిన విద్యుత్తు బిల్లులు ప్రజలు ఇప్పటికే చెల్లించారని, ఆ చెల్లించిన బిల్లులు సరిపోక, మళ్లీ ప్రజలకు ట్రూ అప్ ఛార్జీలు వేసిభారం మోపుతున్నారని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కూటమి ప్రభుత్వం దీనిని పరిశీలించి సర్దుబాటు ఛార్జీలను రద్దు చేసి, విద్యుత్తు బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కంచరపాలెం జోన్ నాయకులు ఎస్. రామ్‌గోపాల్, బి.ఎన్. మూర్తి, బి. ఈశ్వరమ్మ, అప్పారావు, మోహన్‌రావు, శ్రావణ్‌కుమార్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



పుస్తకావిష్కరణలో డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, వి.వి.రమణ మూర్తి తదితరులు

'ప్రేమకు చిరునామా' కథల సంపుటి ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే : సత్యవాడ సోదరీమణులు సూర్యకుమారి, రఘునాథమ్మ రచించిన 'ప్రేమకు చిరునామా' కథల సంపుటి పుస్తకావిష్కరణ శనివారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో జరిగింది. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.వి. రమణ మూర్తి అధ్యక్షతన డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ఆవిష్కరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సత్యవాడ సోదరీమణులు జ్ఞానేనేత్రాలతో కథలు రాశారన్నారు. ఇందులోని 18 కథలు మానవీయ కోణంలో ఉన్నాయన్నారు. స్వరాజ్యం వెంకటరమణమ్మ, సత్యవాడ వేణుగోపాలరావు, బాలగాయత్రి, రాజా వెంకన్న, మేడా మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

మాధవధార, కంచరపాలెం - న్యూస్‌టుడే: మర్రిపాలెం సబ్‌స్టేషన్ పరిధి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న పలు కంపెనీలు, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోనున్నట్లుగా డీఈ బి.కె.నాయకుడు తెలియజేశారు.



దొండపర్తి సమీప నెహ్రూబజార్ వద్దనున్న ప్రాంతీయ గ్రంథాలయం సిబ్బందితో శనివారం మాట్లాడుతున్న రాష్ట్ర విద్య, ఐ.టి. శాఖ మంత్రి నారా లోకేశ్
- న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

8 కమ్యూనిటీ భవనాలు నిర్మించండి

కంచరపాలెం, న్యూస్‌టుడే: 48వ వార్డులో ఎనిమిది కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని కోరుతూ శనివారం జీవీఎంసీ కమిషనరు సంపత్‌కుమార్‌కు భాజపా ఫ్లోరు లీడరు, వార్డు కార్పొరేటరు గంకల కవిత వినతి పత్రం అందజేశారు. ఇందిరానగర్ 1, 2, 3,4,5, జైభారత్‌నగర్, న్యూ శ్రీనివాస్‌నగర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న వారంతా పేదలేనని వారికి కమ్యూనిటీ భవనాలు లేకపోవడంతో శుభకార్యాలకు నానా అవస్థలు పడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఆయా ప్రాంత వాసులకు అందుబాటులోకి వాటిని తేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే తుపాను వస్తే కొండ అంతా కరిగి బండరాళ్లు జారిపడుతున్నాయని, కొండ చుట్టూ రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు పాల్గొన్నారు.



జీవీఎంసీ కమిషనరు సంపత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గంకల కవిత తదితరులు

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

సీతంపేట, న్యూస్‌టుడే : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు స్పష్టం చేశారు. నగరంలోని రామాటాకీస్ దరి అంబేడ్కర్ భవన్‌లో శనివారం 'భారత రాజ్యాంగం-ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రిజర్వేషన్లు' అన్న అంశంపై అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రవేశిక ప్రకారం అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో దళితులు, బహుజనులకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కోసం రూ.50లక్షలు ఎం.పి ల్యాడ్స్ నుంచి కేటాయిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జేవీ ప్రభాకర్, డాక్టర్ జి.అర్జున్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నుంచి బయ్యే మల్లయ్య, మాటూరి శ్రీనవాసరావు, ఐ.అనిల్ కుమార్, వి.ఎన్.ఎస్. రామారావు, గార సత్యనారాయణ, బత్తుల గౌతమ్ బాబు, కే.సాధు, బి.పి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

వైభవునికి సుప్రభాత సేవ

మురళీనగర్, న్యూస్‌టుడే : ఎన్‌జీజీఓస్ కాలనీ కప్పరాడ శ్రీ వైభవ వెంకటేశ్వరుని దివ్యక్షేత్రంలో శనివారం ఉదయం ఆలయ సంప్రదాయ ప్రకారం వేదమంత్రోచ్ఛరణలతో, మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీవారి ముఖ్యమండపంలో భక్తుల సమక్షంలో వేద పండితులు సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వైభవుని సుప్రభాత సేవకు ఆలయ ప్రదక్షిణ

19వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

తాటిచెట్లపాలెం: విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 19వ రోజుకు చేరుకున్నాయి. శనివారం ఈ శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ఉద్దేశపూర్వంగా నిర్వీరం చేసి ప్రయివేట్ సంస్థలకు అప్పగిస్తుందని ఆరోపించారు. లాభాల్లో ఉన్న పోర్టుకు సంబంధించిన ఆసుపత్రిని సైతం ప్రయివేట్ పరం చేయడం తగదని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు శంకరరావు, రాఘవులు, నాయుడు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



నిరాహారదీక్షలు చేస్తున్న పోర్టు కార్మిక సంఘం నాయకులు

రాత్రి ట్రాఫిక్ గందరగోళం..!

కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఏడాది క్రితం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే రహదారిలో పాఠశాల విద్యార్థులను తీసుకెళుతున్న ఆటో వేగంగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో విద్యార్థులకు గాయాలయ్యాయి. అప్పట్నుంచి నగరంలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను రాత్రి సమయాలలోనూ అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ట్రాఫిక్ పోలీసులు ఆ విధానాన్ని పట్టించుకోవడం లేదు. కూడళ్లలో పగటి పూట శిరస్త్రాణం ధరించకుండా వెళుతున్న చోదకుల ఛాయాచిత్రాలు తీయడానికే పరిమితమవుతున్న పోలీసులు రాత్రి 8 గంటల తరువాత రహదార్లపై కనిపించడం లేదనే విమర్శలొస్తున్నాయి. శనివారం రాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్‌లో ఎరుపు, ఆకుపచ్చ రంగుల దీపాలు ఒకేసారి వెలిగి అలాగే ఉండిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. మరో పక్క నిబంధనలకు విరుద్ధంగా పదుల సంఖ్యలో ప్రయివేటు బస్సులు గంటల తరబడి పైవంతెన దిగువన నిలిపివేస్తున్నారు. ప్రయాణికులను పిలిచి మరీ ఎక్కించుకుంటున్నా ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఆర్నెళ్ల క్రితం ఓ యువకుణ్ని ప్రయివేటు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయినా వాటి రాకపోకలను నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. నగరంలో అత్యంత రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలోనూ ట్రాఫిక్ పోలీసులు కనిపించకపోవడంతో ఆటోలు, ప్రయివేటు బస్సులతో ఈ ప్రాంతమంతా గందరగోళంగా మారుతోంది. ఇప్పటికైనా రాత్రి పూట ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు.



ట్రాఫిక్ సిగ్నల్‌లో వెలుగుతున్న ఎరుపు, ఆకుపచ్చ దీపాలు



పైవంతెన దిగువన నిలిపిన ప్రయివేటు బస్సులు

వ్యర్థాలు ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలింపు

సూర్యబాగ్ (అల్లిపురం), న్యూస్‌టుడే: వర్షాలు పడే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్య నాయుడు సూచించారు. సూర్యబాగ్ జోన్-4 కార్యాలయంలో శనివారం పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జెడ్సీ మల్లయ్యనాయుడు మాట్లాడుతూ కాలువలు, గెడ్డల్లో పూడికతీత పనులకు జేసీబీ, బాబ్‌కార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుద్ధ్య అధికారులు, కార్మికులు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించాలని ఆదేశించించారు. జోన్-4 పరిధిలోని ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి స్థానికులను అప్రమత్తం చేయాలన్నారు. పాత భవనాలను గుర్తించి తక్షణమే సంబంధిత యజమానులతో మాట్లాడాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ ఈఈ మురళీకృష్ణ, ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు



భోజనం నాణ్యతను తనిఖీ చేస్తున్న వెంకటశేషమ్మ

పోక్సో చట్టంపై అవగాహన

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 33వ వార్డు మహాత్మా గాంధీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవల సాధికార సమితి అధ్యక్షురాలు, సీనియర్ న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ఆడపిల్లలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల్లి చెప్పిన మాటలను శ్రద్ధతో విని నడుచుకోవాలన్నారు. యువత మొబైల్ ఫోన్ వాడకం తగ్గించి, చదువుపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పోక్సో చట్టం-విధి విధానాలను వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి బాగుందని ప్రశంసించారు. మండల విద్యాధికారిణి పుష్యరాగం, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం వి. శివజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలే తప్ప అక్రమ రవాణా చేయకూడదని ఇందిర ప్రియదర్శిని సంస్థ అధ్యక్షులు కె.ఇందిర అన్నారు. బానిసత్వం వైపు మనిషిని నడిపించే సంస్కృతిని విడనాడాలని, మానవ హక్కుల పరిరక్షణకు పౌర సమాజం కృషి చేయాలన్నారు. శనివారం ఏవీఎన్ కళాశాలలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.సింహాద్రి నాయుడు, వైస్ ప్రిన్సిపల్ కృష్ణకుమారి, పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, వనిత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న గ్రామజ్యోతి సొసైటీ ప్రతినిధి ఇందిర, తదితరులు

మద్యం దుకాణం ఏర్పాటుపై ఆందోళన

అల్లిపురం, న్యూస్‌టుడే: స్థానిక భూపేష్‌నగర్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటును శనివారం స్థానిక మహిళలు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. పలువురు మహిళలు మాట్లాడుతూ భూపేష్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటికే రెండు మద్యం దుకాణాలు, ఒక బార్ ఉన్నాయన్నారు. తమ ఇళ్లకు వెళ్లే మార్గానికి ఆనుకుని ఉన్న దుకాణాన్ని మద్యం దుకాణంగా మార్చడంతో మహిళలు, యువతులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడతారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.



దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం


సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్ వరలక్ష్మి

ఆకుకూరలతో ఆరోగ్యం

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : నిత్యం ఆకుకూరలు తీసుకుంటే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి సూచించారు. శనివారం శ్రీహరిపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహనలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా మునగ ఆకు, కరివేపాకు ఆహారంలో ఉండాలన్నారు. వాటిల్లో అధిక పోషకాలు ఉంటాయని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ఈ రెండు మొక్కలూ పెంచుకోవాలన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ రాము

పరిశుభ్రతకు ప్రాధాన్యం

సింధియా, న్యూస్‌టుడే : జీవీఎంసీ అయిదో జోన్ కమిషనర్ రాము శనివారం పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడా మురుగు నిల్వలు ఉండకూడదని, వ్యర్థాల కుప్పల్ని ఎప్పటికప్పుడు తరలించాలని సిబ్బందికి సూచించారు. మంచినీటి సరఫరా తీరుతెన్నులపై ఆరా తీశారు. పారిశుద్ధ్య సిబ్బంది విధులు, హాజరుపై తనిఖీ చేశారు.

అధికారుల తీరేంటో.. ఆక్రమణలపై దయేంటో

జీవీఎంసీ 87వ వార్డు కణితి నిర్వాసిత కాలనీలో చేపడుతున్న ప్రధాన గెడ్డ రక్షణ గోడ నిర్మాణ పనుల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గెడ్డలో ఆక్రమణలు తొలగించకుండానే పనులు చేయడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, కూర్మన్నపాలెం(వడ్లపూడి)

పరిశీలన

తొలగింపు లేకుండానే రక్షణ గోడ నిర్మాణం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

కణితి లక్ష్మీపురం కాలనీ నుంచి వడ్లపూడి ప్రధాన రహదారిలో కల్వర్టు మీదుగా ముస్లిం వీధి వరకు ఉన్న గెడ్డ రక్షణ గోడ నిర్మాణానికి రూ.1.99 కోట్లు కేటాయించారు. గతంలో వడ్లపూడి ప్రధాన రహదారి పక్కన ఇదే గెడ్డను ఆనుకుని ఓ భవనాన్ని నిర్మించారు. అప్పట్లోనే గెడ్డ స్థలాన్ని కొంతమేర పూడ్చి, సిమ్మెంట్‌తో పక్కా నిర్మాణం చేపట్టారు.


గెడ్డలో ఆక్రమణ తొలగించకుండానే రక్షణ గోడ నిర్మాణానికి చేసిన ఏర్పాట్లు

● ఇప్పుడు అదే గెడ్డ అభివృద్ధి పనులు చేపడుతున్నప్పుడు సిమెంట్ నిర్మాణం అడ్డంకిగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆక్రమణ తొలగించకుండానే.. రక్షణ గోడను వంకరటింకరగా నిర్మించడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

● స్థానిక వార్డు ప్రజాప్రతినిధి, జీవీఎంసీ ఉన్నతాధికారుల సూచనలతోనే క్షేత్రస్థాయి సిబ్బంది ఆక్రమణ జోలికి వెళ్లడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల వార్డు ప్రజాప్రతినిధి పనుల పరిశీలన పేరుతో క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పర్యటించారు. ఆక్రమణ వద్ద ఎలాంటి తొలగింపులు చేపట్టొద్దని సిబ్బందికి సూచనలు చేసినట్టు సమాచారం.

● ఇప్పటికైనా సంబంధిత జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి.. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గెడ్డ ఆక్రమణ తొలగించి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

● ఈ సమస్యపై జీవీఎంసీ డీఈ అప్పారావు వివరణ కోరగా... "గెడ్డలో అడ్డుగా ఉన్న సిమెంట్ నిర్మాణాన్ని తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగానికి సూచించాం. ఆ పనులు పూర్తవగానే, రక్షణ గోడ నిర్మిస్తాం".


పనులు చేపట్టే ప్రాంతం ఇదే..

కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం

దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫాం వైపు ఏళ్ల నుంచి పరిష్కారం కాని మురుగు సమస్యకు పరిష్కారం చూపేందుకు రైల్వే అధికారులు ముందుకొచ్చారు. అమృతభారత్ పథకం ద్వారా చేపడుతున్న రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా మురుగు ప్రవాహానికి వీలుగా రహదారిపై కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇన్నాళ్లు దువ్వాడ సెక్టర్-1, బీసీకాలనీ, దుర్గానగర్ కాలనీల నుంచి వచ్చే మురుగు నీరంతా నాలుగో ప్లాట్‌ఫాం వైపు బస్సుల ఆగే స్థలంలో నిలిచిపోయేది. ఈ సమస్యపై గతంలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పట్లో స్పందించిన అధికారులు తాత్కాలికంగా కాలువ తవ్వి వదిలేశారు. ఇప్పుడు శాశ్వత పరిష్కారం చూపేలా కల్వర్టు నిర్మిస్తున్నారు. –న్యూస్‌టుడే, కూర్మన్నపాలెం(దువ్వాడ)

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	గాజువాక: 98494 65088
	పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, కూర్మన్నపాలెం

?: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనచోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

–జి.పరదేసినాయుడు, లక్ష్మీపురంకాలనీ

అధికారి : ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

–ఎంఆర్ఎస్.అప్పారావు, జీవీఎంసీ డీఈ

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు: ఆర్టీపేట ఏపీఈపీడీసీఎల్ విద్యుత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, గవర కంచరపాలెం పరిసర గెడ్డల్లో భారీగా వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన, దోమల బెడద ఎక్కువైన సమస్యపై గతంలో పలుమార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన 56వ వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ రమేష్ శనివారం తమ సిబ్బందితో పూడికతీత పనులు చేయించారు. –న్యూస్‌టుడే, కరాస

ప్రమాదాల నివారణపై అవగాహన

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం జరిగితే... చేపట్టాల్సిన రక్షణ చర్యలపై శనివారం వీసెజ్ పరిధి సినర్జిస్ కాస్టింగ్ పరిశ్రమలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని, రసాయన, విద్యుత్తు సంబంధిత ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. విశ్రాంత అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ మునిరత్నం నాయుడు హాజరై పలు సూచనలు చేశారు. సీనియర్ మేనేజర్ రమణమూర్తి, పరిశ్రమ భద్రతాధికారి నీలకంఠరావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


మంటల్ని ఆర్పే విధానంపై వివరిస్తూ..

బాలలు.. భళా..!





గాజువాకలోని చలపతి ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో విద్యార్థులకు శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభమా-నష్టమా', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీల్లో జరిగాయి. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు వి.కామేశ్వర్, వి.జాహ్నవి, ఏ.చరణ్‌దీక్షిత్‌లకు పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శ్రీధర్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

–న్యూస్‌టుడే, అక్కిరెడ్డిపాలెం, గాజువాక

వేగ నిరోధకాల ఏర్పాటు


పనులు చేస్తున్న సిబ్బంది

ఈనాడు కథనానికి స్పందన

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం ఏరువానిపాలెం- ములగాడ శివారు ప్రాంత రహదారిలో శనివారం వేగ నిరోధకాలు ఏర్పాటు చేశారు. డాక్‌యార్డు వంతెన మూసివేతతో ప్రయాణికులంతా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు వాహన చోదకులు అతివేగంగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యపై 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. స్పందించిన జీవీఎంసీ ప్రజా పనుల విభాగం ఆధ్వర్యంలో మొత్తం ఎనిమిది చోట్ల వేగ నిరోధకాలు ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


శీలానగర్‌లో...

సాయంత్రం ఉత్సవమూర్తుల్ని ఊరేగించారు. పెదగంట్యాడ వాంబేకాలనీ వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు చేసి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

సింధియా, న్యూస్‌టుడే : జీవీఎంసీ 58వ వార్డు చిన ములగాడలో శనివారం దుర్గాదేవి ఉత్సవాల సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ 73వ వార్డు శ్రీ పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో శనివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. తెలుగు యువత గాజువాక నియోజకవర్గం ప్రతినిధి బలగ బాలునాయుడు అమ్మవారికి పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు జగదీశ్, హనీష్, చైతూ, ప్రసాద్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.


వాంబేకాలనీలో అన్నదానం

శిశువు మృతిపై విచారణకు డిమాండ్

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రిలో శనివారం ఉదయం శిశువు మృతి చెందిన ఘటనపై కలకలం రేగింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని ఆరోపిస్తూ బాధితులు విచారణకు డిమాండ్ చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. గాజువాక సమీప నడుపూరుకు చెందిన ఎస్.సుచిత్ర కాన్పు కోసం శుక్రవారం ఆసుపత్రిలో చేరారు. పరీక్షించిన వైద్య సిబ్బంది సాధారణ డెలివరీ అవుతుందని చెప్పారు. అర్ధరాత్రి సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు డాక్టర్ గంగా భవానీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె పరీక్షించి, నొప్పులు ఎక్కువయ్యాయక పిలవాలని చెప్పి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి డెలివరీ చేయించడంతో మగ శిశువు జన్మించాడు. అప్పటికే శిశువులో చలనం లేకపోవడంతో కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. బాధితులు అంబులెన్స్ కోసం ప్రయత్నించేలోపు శిశువు ఉమ్మనీరు తాగి మృతి చెందినట్టు సిబ్బంది ధ్రువీకరించారు. దీంతో బాధిత కుటుంబీకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సుచిత్ర భర్త రాము, కుటుంబ సభ్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.భారతితో పాటు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులు కర్రి దశేంద్ర, గవర సోమశేఖరరావు, బి.సత్యనారాయణ ఆసుపత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సూపరింటెండెంట్ భారతి మాట్లాడుతూ... విచారణకు కమిటీ వేస్తామని చెప్పారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉందని తేలితే, చర్యలు తీసుకుంటామన్నారు.


సూపరింటెండెంట్ భారతికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సంక్షిప్త సమాచారం..

మంత్రి లోకేశ్ తిరుగుపయనం

ఎన్ఏడీకూడలి (కాకానినగర్), న్యూస్‌టుడే: కోర్టు పని నిమిత్తం నగరానికి వచ్చిన రాష్ట్రమంత్రి నారా లోకేశ్ శనివారం తిరుగు పయనమయ్యారు. విశాఖ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన ఆయనకు తెదేపా ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : ఉక్కు నిర్వాసితుల సమస్యల్ని పరిష్కరించాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, తెదేపా నాయకులు రమణారెడ్డి కోరారు. వారు శనివారం మంత్రి నారా లోకేశ్‌ను నగరంలో కలిసి వివిధ సమస్యలపై వినతులు అందించారు. ఉక్కు పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

నేడు భీమిలిలో జిల్లా స్థాయి పోటీలు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షులు, విశ్రాంత ప్రిన్సిపల్ కాళ్ల సూర్య రామకృష్ణారావు శనివారం తెలిపారు. భీమిలిలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం వేదికగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం, విజయాలు, వైఫల్యాలు, ప్రపంచ శాంతి, భద్రతా సమితి వైఫల్యాలు, తదితర అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రయివేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు వేదిక వద్దకు నిర్ణీత సమయానికి అరగంట ముందు చేరుకుని నేరుగా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 89856 47419 నంబరును సంప్రదించాలన్నారు.

అప్రమత్తతతో క్యాన్సర్ దూరం


వడ్లపూడి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.శ్రవంతి సూచించారు. శనివారం నిర్వాసిత కణితి అంగన్‌వాడీ కేంద్రంలో కుశాల్ ప్రాజెక్టు కార్యక్రమాల్లో భాగంగా క్యాన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నిత్యం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు, వ్యాయామం చేయాలన్నారు. ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. కుశాల్ ప్రాజెక్టు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ ఎల్.దివ్య, అంగన్‌వాడీ కార్యకర్త బి.మేరీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కళింగ వీధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ బొండా జగన్ శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుకు సూచించారు. అనంతరం ఓపెన జిమ్‌లో పరికరాల నాణ్యత, వినియోగంపై ఆరా తీశారు. ఏఈ మహాలక్ష్మి, వార్డు నాయకులు విజయరామరాజు, డి.రాజేంద్ర, డీవీ.సూరిబాబు, బి.సన్యాసిరావు, పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం, ఖారవేలనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న కార్పొరేటర్ జగన్

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

కరాస, న్యూస్‌టుడే : రైతుబజార్లలో నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్‌కే.యాసిన్ సూచించారు. శనివారం మర్రిపాలెం రైతుబజారుకు వచ్చిన కర్నూల్ ఉల్లిపాయల్ని ఆయన పరిశీలించారు. టమాటా, వంటనూనె కౌంటర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ బియ్యం కార్డు ఉన్న వారి వివరాలు నమోదు చేసుకుని నూనె విక్రయించాలని ఆదేశించారు. బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


ఉల్లిపాయల నాణ్యత పరిశీలిస్తున్న యాసిన్

నేడు రక్తదాన శిబిరం

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 79వ వార్డు ఉక్కు అనుసంధాన రహదారి పక్కన రామాలయం ప్రాంగణంలో ఆదివారం ఉత్తరాంధ్ర క్రేన్ ఆపరేటర్స్ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. దాతలకు అన్నదానంతో పాటు మొక్కల పంపిణీ ఉంటుందని వార్డు జనసేన అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ తెలిపారు.

చరవాణి దొంగ అరెస్టు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : చరవాణి దొంగను శనివారం దువ్వాడ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలు.. ఈనెల 5న చిత్తూరు నుంచి టమాటా లోడుతో గాజువాక వచ్చిన లారీ డ్రైవర్ ఎస్.చిరంజీవి సరకు దిగుమతి చేసిన తర్వాత, అదే రోజు రాత్రి కూర్మన్నపాలెం సమీపంలో లారీ నిలిపి పడుకున్నాడు. తెల్లారిలేచి చూసేసరికి డ్యాష్‌బోర్డులో ఉంచిన చరవాణి, రూ.7 వేలు నగదు మాయమైనట్టు గుర్తించాడు. చోరీపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు... శనివారం మధ్యాహ్నం పెదగంట్యాడ దయాల్‌నగర్‌కు చెందిన పాత నేరస్థుడు కె.మణిలోకేష్(23) వడ్లపూడిలో అనుమానాస్పందంగా సంచరిస్తుండడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు నేరం అంగీకరించడంతో అరెస్టు చేశారు.

'మార్కెటింగ్ అవకాశాల'పై సదస్సు

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : పెట్టుబడిదారులకు క్యాపిటల్ మార్కెట్‌తో మేలు జరిగే అవకాశాలు ఉన్నాయని బ్రాడ్‌రిడ్జ్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అసోసియేట్ మేనేజర్ టి.సాయిప్రదీప్ అన్నారు. శనివారం దువ్వాడ విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కళాశాలలో 'కాపిటల్ మార్కెట్- దాని పరిణామాలు' అనే అంశంపై ఎంబీఏ విద్యార్థులకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్ రంగంలో వస్తున్న మార్పులు, ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు ధోరణులపై వివరించారు. అనంతరం ఆయన్ను కళాశాల ప్రతినిధులు సత్కరించారు. రెక్టార్ వి.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ పీఎస్.రవీంద్ర, ఎంబీఏ విభాగాధిపతి బి.చంద్ర, డీన్‌లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.


సాయిప్రదీప్‌ను సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపల్ రవీంద్ర, తదితరులు

భానుడి వెలుగులు.. వెండి మబ్బులు..


వాతావరణ మార్పులతో శనివారం మధ్యాహ్నం గాజువాక పరిసరాల్లో ఓవైపు ఎండతీవ్రత ఉండగా, మరోవైపు మబ్బులు కమ్ముకున్నాయి. ఆకాశంలో దృశ్యాన్ని చూసేందుకు పలువురు ఆసక్తి చూపారు. –న్యూస్‌టుడే, అక్కిరెడ్డిపాలెం

తాత్కాలిక ప్రాతిపదికన సాగరమిత్ర పోస్టుల భర్తీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: సాగరమిత్ర పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రెండు పోస్టులు భర్తీ చేస్తామని, నెలకు రూ.10వేలు వేతనంగా ఇస్తామని, పనితీరు బాగుంటే మరో రూ.5వేలు ప్రోత్సాహకం రూపంలో చెల్లిస్తామన్నారు. ఫిషరీస్‌లో పాలిటెక్నిక్ డిప్లమో లేదా బీఎస్సీ ఫిషరీస్ సైన్స్, మెరైన్ బయాలజీ, జువాలజీ డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 31వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులను చేపలరేవులోని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కూడలిలో ట్రాఫిక్ కష్టాలు



జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోడ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలను అడ్డంగా నిలిపేయడంతో ఇతర ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటోందని, ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మల్కాపురం

ఉమ్మడి విశాఖ జిల్లా చెస్ జట్ల ఎంపిక

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లా చెస్ జట్లు ఎంపిక శనివారం అనకాపల్లి జీవీఎంసీ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీల్లో 350 మంది బాలబాలికలు పాల్గొన్నారు. వీరిలో 14, 17 ఏళ్ల లోపు బాల, బాలికల టీములు ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ సమైఖ్య జిల్లా కార్యదర్శి మోటూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఒక్కొక్క టీమ్‌లో ఎనిమిది మంది ఉంటారన్నారు.

● 17 ఏళ్లలోపు బాలికల జట్టులో ఏ.స్వాతి, ఎం.హాసిని, ఎ.ఎం.అన్నపూర్ణ, ఎస్.కుమారి, ఎస్.ఎస్.సాయిప్రియ, జి.తులసి, వి.ఎల్.ప్రియ, కె.కిరణ్‌మయి, బాలుర జట్టులో పీఎస్ కౌసిక్, వి.వెంకటేశ్వరరావు, కె.టి.కుమార్, కె.ఎం.సాయి, ఎస్.స్వాతిక్, బి.చిత్రేస్, ఎస్.సోహన్, ఎం.సాగర్ స్థానం సంపాదించారు. 14ఏళ్లలోపు బాలుర జట్టులో ఎన్.జె.ఎస్.నవదీర్, ఎ.వైభవ్, ఎన్.చంద్ర ఈశ్వర్, పి.నారాయణమూర్తి, బీవీ అనీష్, పి.శివదీరజ్, జె.జనార్దన్, ఎష్.హరీష్, బాలికల జట్టులో బి.శావ్యశ్రీ, పి.సత్యశ్రీవిద్య, ఎం.మనస్వి, ఎన్.దివ్యదర్శిని, దివ్యకుమారి, పి.జిస్విత్రప్రియ, పి.జనని, కె.సిరి ఎంపికయ్యారు.


అర్జునరావుకు కన్నీటి వీడ్కోలు


అంత్యక్రియలకు హాజరైన వివిధ పార్టీల నాయకులు, స్థానికులు

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : పారిశ్రామికవేత్త, విద్యావేత్త పంపన అర్జునరావు అంత్యక్రియలు శనివారం ఆటోనగర్ శ్మశానవాటికలో జరిగాయి. వివిధ పార్టీ నాయకులు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. కార్పొరేటర్ స్టాలిన్, భాజపా కన్వీనర్ నర్సింగరావు, నాయకులు శీరట్ల వాసు, బాటా శ్రీనివాస్, నాగేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతి అందజేత

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంలో నెలకొన్న సమస్యలతో పాటు, కార్మికులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఉక్కు ఇంటక్ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు శనివారం ఇంటక్ జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డిని హైదరాబాద్ నివాసంలో కలిసి వివిధ అంశాలు వివరించారు. కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసేలా కృషి చేయాలని కోరారు. సభ్యులు వి.జె.శేఖర్, అశోక్‌రాజు, మోహన్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సంజీవరెడ్డిని కలిసిన ఉక్కు ఇంటక్ నాయకుల